నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఆదివారం
9 జూన్ 2024
పేజీలు 12
ప్రకాశం
బాపట్ల

## కొడుకు గెలుపు కోసం..
# వక్రమార్గం



**కుమారుడి గెలుపు కోసం హద్దులు దాటారు.. ఎవరూ గుర్తించరని అనుకున్నారు.. అధికారం ఉందని నిబంధలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడ్డారు.. 10 శాతం కంటే కేటాయింపులు చేయకూడదని నిబంధన ఉన్నా పట్టించుకోలేదు.. ఎన్నికల కోడ్‌ను కూడా లేక్క చేయలేదు.. తమ నాయకులకు డబ్బులు కావాలి.. తమకు అధికారం ఉంది అభివృద్ధి పనులను ముక్కలుగా చేసి నాయకులకు అప్పగించారు.. ఎన్నికల కోడ్‌లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడి.. పాత తేదీలతో ఆ పనులకు మంజూరు చేశామని ఓ అధికారి ద్వారా రికార్డు బిల్డప్ చేశారు.. ఉన్న బడ్జెట్ కంటే 35 కోట్లు ఒక్క నియోకజవర్గానికి కేటాయించి ఎన్నికల్లో దర్శిలో వైకాపా అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గెలుపునకు జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కొంటారి సాగించిన అవినీతి భాగోతం బయటపడటంతో విజిలెన్స్ విచారణకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు.**

సూర్యప్రతినిధి, ఒంగోలు

ప్రకాశం జిల్లా జిల్లా పరిషత్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. జిల్లాలో వివిధ ప్రాంతాల అభివృద్ధి చేపట్టాల్సిన పనులను దారి మళ్లించి ఛైర్మన్ కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పోటీచేసిన దర్శి నియోజక వర్గంలో భారీగా పనుల రూపంలో నిధులు కేటాయించడం జిల్లా పరిషత్‌లో జరిగిన అక్రమాలకు అద్దం పడుతుంది. ప్రకాశం జిల్లా పరిషత్తు జనరల్ ఫండ్ నుంచి వివిధ అభివృద్ధి పనులకోసం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు అభివృద్ధి పనులు కేటాయిస్తారు. ఇందుకోసం ముందస్తుగా సమావేశాలు ఏర్పాటు చేయడం బడ్జెట ఆమోదం ద్వారా పనులను చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తారు. కానీ దర్శి నియోజకవర్గంలో ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు జడ్పీ సిబ్బంది అక్కడి ప్రజాప్రతినిధితో కలసి చేసిన అవినీతి భాగోతంపై నేడు జిల్లా వ్యాప్తంగా చర్చ నీయాంశంగా మారింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు 2019-2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-2024 వరకు సుమారు 1585 వర్క్‌లను కేటాయించడం జరిగింది. ఇందులో గిద్దలూరు నియోజకవర్గానికి 154, కనిగిరి 122, కొండపి 96, మార్కాపురం 140, ఒంగోలు 158, ఎస్ఎన్ పాడు 161, యర్రగొండపాలెం 206 వర్కులు జనరల్ ఫండ్ నుంచి కేటాయించారు. అయితే ఇదే సమయంలో దర్శి నియోజకవర్గానికి మాత్రం అధికారం ఉందని 512 వర్కులు కేటాయించడం వెనుక భారీగా ఎన్నికల లబ్దితో పాటు మోసం బట్టబయలవుతుంది. వాస్తవానికి కేటాయించిన వర్కుల నుంచి ఏ నియోజకవర్గానికి

మిగతా 3లో



జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ



జడ్పీ మాజీ అధికారి జాలిరెడ్డి




- ఎన్నికల్లో ప్రయోజనం కోసం నిబంధనలకు విరుద్ధంగా దర్శికి జడ్పీ నుంచి 512 పనులు
- ఇతర నియోజకవర్గాలకు చేతి విదిలింపు
- బడ్జెట్‌లో పది శాతమే కేటాయించాల్సి ఉన్నా 300 శాతం దర్శికి కేటాయింపులు
- నామినేటెడ్ పనుల పేరిట దర్శి వైకాపా నాయకులకు ఎన్నికల్లో నజరానా
- ఎన్నికల కోడ్ ఉన్నా.. పాత తేదీలతో రికార్డుల బిల్డప్
- రికార్డు తయారీలో పాత అధికారి కీలకం
- సహకరించిన వైకాపా వీర అభిమాన ఉద్యోగులు
- జడ్పీటిసిలకు తెలియకుండా జిల్లా పరిషత్‌లో భారీ స్కామ్
- విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధం
- వర్కులు తీసుకుని ఓట్లు వేయకపోతే నేనే మూడేళ్లు ఛైర్మన్‌గా ఉంటా
- ఓట్లు వేయకపోతే ఒక్క రూపాయి కూడా ఇవ్వనంటూ బెదిరింపులు

# ఆత్మ విశ్వాసమే ఆయుధం



**ముత్తుముల ఆత్మ విశ్వాసం ముందు గెలుపు తలొగ్గింది. నాడు ఘోర పరాజయమే.. నేడు విజయ తీరాల వైపు అడుగులు పడేలా చేసింది. 2019లో ప్రత్యర్థి చేతిలో 83 వేల ఓట్లతో ఓడిపోయినా ఆత్మ విశ్వాసం చెక్కు చెదరలేదు. నియోజకవర్గాన్ని, పార్టీని వీడలేదు. ఆయన్ను నమ్ముకున్న ప్రజల కోసం, పార్టీ సిద్ధాంతాల కోసం అనునిత్యం అధికార పక్షంపై ప్రజాగళం వినిపించారు. పట్టువదలని విక్రమార్కుడిలా నియోజకవర్గంలో ప్రతిగడపను తొక్కారు. ప్రతి వ్యక్తిని కలిశారు. మీకు నేనున్నా, మీ అభివృద్ధి నా బాధ్యత అంటూ భరోసాను కల్పించారు. ప్రజలే సిరాస్థిగా భావించిన ముత్తుములకు నేడు ప్రజలు పట్టంకట్టారు. వైసిపి కంచుకోట గిద్దలూరును బద్దలు కొట్టి టిడిపి జెండాను రెపరెపలాడించిన ముత్తుములకు ప్రశంసలు వెల్లువెత్తాయి.**

గిద్దలూరు, మేజర్‌న్యూస్ : వైసిపి కంచుకోట గిద్దలూరు అడ్డాపై తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడింది. కూటమి అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డికి ప్రజలు పట్టంకట్టారు. వైసిపి అభ్యర్థి నాగార్జునరెడ్డికి ఓటర్లు గుణపాఠం చెప్పారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థి చేతిలో ఘోర పరాజయం పొందిన ముత్తుముల అశోక్‌రెడ్డి ఆత్మవిశ్వాసం

మిగతా 3లో

- వైసిపి కంచుకోటను బద్దలు కొట్టిన అశోక్‌రెడ్డి
- 25 ఏళ్ల సుధీర్ఘ కాలం తర్వాత గిద్దలూరులో టిడిపికి విజయం
- రాజకీయ వ్యూహంతో గిద్దలూరు ప్రజాకోటపై పసుపు జెండా రెపరెపలు
- నాడు ప్రత్యర్థి చేతిలో ఘోర పరాజయం, సంకల్ప దీక్షతో నేడు విజయం
- నియోజకవర్గ ప్రజలే స్థిరాస్థిగా భావించి నిత్యం ప్రజల్లోనే
- ప్రజా నాయకుడు ముత్తుములకు పట్టం కట్టిన ఓటర్లు
- గిద్దలూరు చరిత్రను తిరగరాసిన ముత్తుములకు పార్టీ పెద్దలు ప్రశంసలు



6,7 లో...



## అక్షర యోధుడు రామోజీరావు
# అస్తమయం

## స్వతంత్ర సమరయోధుల శిలాఫలకం పునర్నిర్మాణం చేయాలి

**- రావూరి నరసింహ వర్మ**



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం పూర్వ ఎంపీడీవో కార్యాలయంలో ప్రస్తుత ఎంఈఓ ఆఫీస్ పక్కన కాళీ ప్రదేశంలో బాపట్ల నియోజకవర్గ స్వతంత్ర సమర యోధుల జ్ఞాపిక శిలాఫలకం చెత్తతో నిండిపో యింది వారికి మనం ఇచ్చే గౌరవం ఇదేనా. తక్షణమే అధికారులు దీనిపై చర్యలు తీసుకొని పునర్నిర్మాణం చేసి ఈ జ్ఞాపికకు పూర్వ వైభవం తేవాలని అప్పుడే స్వతంత్ర సమరయోధులకి మనం నిజమైన నివాళులర్పించినట్టని అన్నారు అఖిలభారత స్వతంత్ర సమర యోధుడు రావూరి శ్రీశైల పతి దత్తత కుమారుడు రావూరి నరసింహ వర్మ. 34 మంది స్వతంత్ర సమరయోధుల పేరుతో నిండిన ఈ శిలాఫలకంలో 30 మంది క్షత్రియులు ఉండటం గమనార్హం.

## మీడియా రారాజు రామోజీ

భట్టిప్రోలు,మేజర్ న్యూస్: దేశంలో మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అక్షర యోధుడు రామోజీ రావ్ అని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు అన్నారు.శనివారం భట్టిప్రోలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పేరు పొందిన రామోజీ ఫిలిం సిటీ నిర్మించి,అనేక వేల మంది యువతకు ఉపాది కల్పించిన వ్యక్తి రామోజీ అని,రామోజీరావు మరణం ఉభయ తెలుగు రాష్ట్రా లకు పెద్ద లోటని వేల్పూరి పేర్కొన్నారు. అతి సామాన్య కుటుంబంలో జన్మించి, అంచలంచెలుగా ఎదిగి, పత్రికా రంగాన్ని స్థాపించి,ఎలక్ట్రానిక్ రంగంలో ఆయన వొరవడిని సృష్టించి,సినీ రంగంలో నిర్మాతగా అడుగిడి అనేకమంది నటీనటులకు,దర్శకులకు మార్గ దర్శకుల య్యారన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీని స్థాపించి అనేకమందికి ఆర్థిక వెసులుబాటు కల్పించార న్నారు. ఆయన మృతి సినీ రంగానికి,పత్రికా రంగానికి తీరని లోటన్నారు.రామోజీ కుటుంబ సభ్యులకు శ్రీనివా సరావు ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి ని వ్యక్తపరిచారు .

## ఈనాడు అధినేత రామోజీరావుకు ఘన నివాళి



కొల్లూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన కొల్లూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కనగాల మధుసూదన్ ప్రసాద్ ప్రముఖ పారిశ్రామికవేత్త ఈనాడు అధినేత రామోజీరావు కి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమానికి తెలుగుదేశం , జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కనగాల మధుసూదన్ ప్రసాద్ మాట్లాడుతూ రామోజీ రావు పరమపదించడం చాలా బాధాకరం,మీడియా ,వ్యాపార రంగాలలో తనదైన స్థాయిలో ముద్ర వేసుకున్నారు.శ్రీరామ్ చిట్స్, మీడియా రంగం, ప్రియా పచ్చళ్ళు, ఇవే కాకుండా ప్రపంచం గర్వించే స్థాయిలో రామోజీ ఫిలిం సిటీ ఏర్పాటు చేసి కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పించారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిది ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుత్తికొండ బుజ్జి, దూళిపూడి కృష్ణ, సమ్మెట దుర్గాప్రసాద్, శనివర్పు నాని, సాత సుధాకర్ రావు, మేకల బాలాజీ, ఆలపాటి వాసు, తోట సాంబశివరావు, మత్తి నరేంద్ర, చిన్న బుజ్జి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి విజయానికి తోడ్పాటు నిచ్చిన ఓటర్లకు ధన్యవాదాలు



భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: కక్ష,కార్పణ్యాలకు ఆలవాలమైన, అరాచక వైసీపీ ప్రభుత్వానికి చరమగీతంపాడి, తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వానికి స్వాగతం పలికిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు.శనివారం మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గం లో 22 వేల ఓట్ల ఆధిక్యతతో నక్కా ఆనంద బాబు గెలుపొందటం నియోజకవర్గం అభివృద్ధి పట్ల,ప్రజా సమస్యల పట్ల స్పందించిన తీరే ఆనందబాబుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు.వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు గ్రామంలో 2718 ఆధిక్యత ఓట్ల మెజారిటీని సాధించి ఆనందబాబు ఆకాంక్షను భట్టిప్రోలు గ్రామపంచాయతీ ఓటర్లు నిలబెట్టారని అందుకు కృషి చేసిన తెలుగుదేశం, జనసేన,బిజెపి పార్టీల నాయకులకు కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.గత ఐదు సంవత్సరాల జగన్ రెడ్డి దుర్మార్గపు పాలనకు ప్రజలు స్వస్తి చెప్పారని జగన్ అరాచకాలను ప్రశ్నించలేని ప్రజలు ఓట్ల రూపంలో చంద్రబాబును బలపరిచి,రాక్షస ప్రభుత్వాన్ని పారద్రోలారని, భట్టిప్రోలు గ్రామంలో మంత్రి మేరుగ నాగార్జున చేసిన అవినీతిని,గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆనందబాబు గ్రామానికి మంజూరు చేసిన సుమారు రూ10 కోట్ల నిధులు నాగార్జున నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి ఆగిపోవడమే కాకుండా సదరు నిధులు మురి గిపోయాయన్నారు. ఈ విషయాలను 'పోరుబాట' పేరుతో ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రజలను చైతన్యవంతం చేయటం తో మేరుగ నాగార్జునను ఆత్మరక్షణలో పడేశా మని,గ్రామ అభివృద్ధిని నిర్లక్ష్యపరిచిన పది ప్రధాన సమస్యలను వెలుగులోనికి తెచ్చి ప్రజల్లో ఆలోచన కలగజేశామని సాయిబాబా తెలిపారు.జగనన్న ఇళ్ల కాలనీలో బలవంతంగా ఇల్లు నిర్మాణాల పేరుతో అధికార పార్టీ నాయకులు చేసిన అవినీతిని నాసిరకం నిర్మాణ పనులను ప్రజలకు వివరించడంతో లబ్ధిదారుల్లో మార్పు వచ్చిందని,జగన్ పార్టీ నాయకులు ఐదు సంవత్సరాల అధికారాన్ని అడ్డుపెట్టుకుని,పోలీసుల ద్వారా బెదిరింపులు చేసి భట్టిప్రోలు గ్రామంలో చేసిన పులివెందుల పంచాయితీలతో గ్రామ ప్రజలు,వ్యాపారస్తులు భయపడటమే ఈ మెజారిటీ కి కారణమన్నారు.భట్టిప్రోలు గ్రామంలో గత ఐదు సంవత్సరాలలో గ్రామపంచాయతీలో కోట్ల రూపాయలను దొంగ బిల్లులు పెట్టి దోచేసిన విషయం,పంచాయతీలో కనీసం ప్రజల సమస్యలను పట్టించుకున్న వాడు లేకపోవటం,ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను ఓట్ల రూపంలో చూపించారని పేర్కొన్నారు.ఉపాధి హామీ నిధులను రూ 60 లక్షల విలువ కలిగిన పనులు చేయకుండా డబ్బులు డ్రాచేసి అధికార పార్టీ నాయకులు పంచుకున్న విషయాన్ని ఆధారాలతో వెలుగులోకి తీసుకురావడంతో ప్రజలు అర్థం చేసుకున్నారని, ఇటువంటి అవినీతి పార్టీని సముద్రంలో కలిపాలని భట్టిప్రోలు ప్రజలు నిర్ణయించుకుని ఇంత మెజారిటీని ఇచ్చారని ఆయన తెలిపారు.తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నన్ను భయపెట్టాలని మేరుగ నాగార్జున,అధికార పార్టీ గుండాలను ఉపయోగించి మా ఇంటి పై దాడి చేసి,నన్ను,నా భార్యను కొట్టటమే భట్టిప్రోలు గ్రామంలో జగన్ పార్టీ గ్రాఫు పడిపోవడానికి కారణమని తెలిపారు.గ్రామపంచాయతీలో జరిగిన కోట్ల రూపాయల అవినీతి పైన,ఉపాధి హామీ నిధుల్లో జరిగిన అవినీతిపైన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికారుల ద్వారా విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని,అలాగే అధికార బలంతో దుర్మార్గంగా ఆక్రమించిన ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాల పట్ల తగు చర్యలు తీసుకుంటామని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పై పెట్టిన అక్రమ కేసుల గురించి తగు చర్యలు తీసుకునే విధంగా కృషి చేయడం జరుగుతుందని సాయిబాబా తెలిపారు. ముందుగా ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాప సూచికంగా సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి,ఆయన ఆత్మకు శాంతి కలగాలని పార్టీ నాయకులు,కార్యకర్తలు కోరారు.ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు





రేపల్లె, మేజర్‌న్యూస్: టీడీపీ కార్యాలయం లో రామోజీ రావు చిత్రపటానికి నివాళులురామోజీరావు కుటుంబానికి సానుభూతి తెలియజేసిన టీడీపీ నాయకులు తెలుగు ప్రజల జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్రవేసిన రామోజీరావు తెలుగు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య అన్నారు. టీడీపీ కార్యాలయం లో శని వారం రామోజీరావు చిత్రపటా నికి టీడీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్ధించారు. రామోజీరావు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ముమ్మనేని మాట్లాడుతూ మంచి దార్శికుని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పత్రికారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. రామోజీఫిల్మ్ సిటి ప్రపంచం లోనే గర్వంగా చెప్పుకునే మన తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అతి పెద్ద స్టూడియో అని చెప్పారు. వివిధ ఛానల్స్, మార్గదర్శి, ప్రియా ఫుడ్స్ ఇలా ఎన్నో సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించారన్నారు. చేనేత విభాగం రాష్ట్ర నాయకులు జి.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యాపారవేత్తగా, మీడియా వ్యవస్థాపకుడిగా, చలనచిత్ర నిర్మాతగా, రామోజీరావు సేవలు అనిర్వచనీయమన్నారు. రామోజీ రావు అంచెలం చెలుగా ఎదిగి ఎంతో మందికి జీవనోపాధి కల్పించారని అన్నారు. పత్రికను మారుమూల గ్రామాలకు సైతం చేర్చి స్థానిక వార్తలకు ప్రాధాన్యం కల్పించారని కొనియాడారు. ఆయన మరణం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అక్షర యోధుడు రామోజీ

వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరు కూరు రామోజీరావు మృతి పట్ల వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నేత వేమూరి మురళీకృష్ణ,తుమ్మల శ్రీనివాసరావు,యల్లమాటి రాజు, నాదెం డ్ల సురేష్,యల్లమాటి రాజేంద్ర, ఈపూ రు ప్రసాద్,మధిర శ్రీనివాసరావు, గోగినేని చంద్రశేఖర రావు, మొవ్వ రమణ య్య, టి రామకృష్ణ ఉన్నారు.

# బీసీల మద్దతుతోనే ఎన్డీఏ ఘనవిజయం: బాపట్ల రవికుమార్



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బీసీలు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడంతో ఎన్డీఏ కూటమి ఊహించని ఘన విజయం సాధించిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కేంద్రం కోర్టు సమీపంలో న్యాయవాది అంగలకుదురు నటరాజన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా కమిటీ బాపట్ల, వేమూరు, రేపల్లె, చీరాల, పర్చూరు, అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులకు, పార్లమెంటు అభ్యర్థికి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామస్థాయి వరకు తమ సంఘం పనిచేయడంతో జిల్లాలోని ప్రతి ఒక్కరు భారీ మెజార్టీ రావటానికి నిదర్శనం అన్నారు. నాలుగుసార్లు బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం అపజయం పాలైన ఈసారి సాధించటం నరేంద్ర వర్మ కృషికి బీసీల మద్దతు తోడైందన్నారు. బీసీల మద్దతుతో అధికారం చేజిక్కించుకున్న ఎన్డీఏ కూటమి బీసీ అభ్యర్థులకు ఎక్కువ శాతం మంత్రి పదవులు కేటాయించాలని కోరారు. జిల్లాలోని 50 శాతంగా మూడు టికెట్లు కేటాయించాలని తాము డిమాండ్ చేశామని, ఇచ్చిన రెండు స్థానాలైన రేపల్లె, చీరాల అభ్యర్థులు ఘన విజయానికి కృషి చేశామన్నారు. ఈ రానున్న ఐదు సంవత్సరాలలో బీసీల సమస్యల పరిష్కార రక్షణ చట్టాలు ఇచ్చిన హామీల నెరవేర్పుపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్పొరేషన్లు, నామినేటేడ్ పదవుల్లో తమ సంఘ సభ్యులకు సముచిత స్థానం కల్పిస్తామన్న ఎమ్మెల్యే అభ్యర్థులు ఇచ్చిన మాట నిలుపుకుంటారనే విశ్వాసం తెలిపారు. ఈ సందర్భంగా తమ సంఘ పిలుపును బీసీలు పటిష్టంగా తీసుకుని ఏకతాటి మీద పనిచేయటం శుభ పరిణామం అని కొనియాడారు.

**వర్మకు శుభాకాంక్షలు**

ముందుగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మను బీసీ సంక్షేమ సంఘం నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీలు అండగా ఉండి గెలిపించిన తీరు ఎప్పటికీ మర్చిపోలేని వర్మ సంతోషం వ్యక్తం చేశారు. బీసీల సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**రామోజీరావు కృశీవలుడు**

సమాజ శ్రేయస్సుపై ముందు చూపుతో కథనాలను రాసి ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించేలా సూచనలు చేయడం రామోజీరావుకు సరి ఎవరు రారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. ప్రతి వర్గాన్ని ప్రేమించే విధముగా సమస్య పరిష్కారం దిశగా సమాచారాన్ని తన ఈనాడులో పత్రికలో ఖచ్చితమైన భాషను ప్రచురించారని ఆయన కొనియాడారు. క్రమశిక్షణ కలిగిన రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శమన్నారు. స్వచ్ఛభారత్ పై విశేషమైన కసరత్తు చేస్తూ ఇంకుడు గుంటలు, సేద్యపు గుంటలను తవ్వించి ఉప్పునీటి సాంద్రత తగ్గేల పని చేయించిన సమర్థమైన వ్యహకర్త రామోజీరావు అన్నారు. ఆయన లేని లోటు భావితర పత్రిక సామ్రాజ్యానికి పెద్ద వెలితిగా నిలుస్తుంది. ఆయన మృతిపై తాను, తన సంఘ నేతలు సంతాపం తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్.ఎస్.పి రాజు, మారం రవికుమార్, జిల్లా న్యాయ సలహాదారుడు అగలకుదురు నటరాజన్, పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసమే ఆయుధం

**మొదటి పేజీ తరువాయి** కోల్పోకుండా నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. ఓపికతో లేచి నిలబడ్డారు. ఒక్కొక్క అడుగు వేస్తూ ప్రజలకు చేరువయ్యారు. వారి కష్టాలు తెలుసుకున్నారు. వారి కష్టాలు తీర్చడానికి ప్రతిపక్ష బాధ్యత పోషించారు. గిద్దలూరు వైసీపీ కంచుకోట అని అంటున్నా, ఇక్కడ గెలవడం అసాధ్యం అనుకున్నా... ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ఐదేళ్లు యుద్ధం చేశారు. పట్టువదలని విక్రమార్కుడై, నేడు ఆ వైసీపీ కంచుకోటల్ని బద్దలు కొటారు. గిద్దలూరు నియోజకవర్గంలో మళ్లీ తెలుగుదేశం జెండా రెపరెపలా డించారు. గిద్దలూరు నియోజకవర్గంలో 25ఏళ్ల తర్వాత తెలుగు దేశం పార్టీకి విజయాన్ని అందించిన ముత్తుముల అశోక్ రెడ్డి గెలుపు ఒక సంచలనం. ఇది పాతాళం లాంటి ఓటమిని గెలుపుగా మార్చిన ధీశాలి.

**గిద్దలూరు రాజకీయ ముఖచిత్రం**

1999 పిడతల విజయకుమార్‌రెడ్డి గెలుపు తర్వాత గిద్దలూరులో తెలుగుదేశం పార్టీ ఇంకోసారి గెలవలేదు. 2014లో మొదటిసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గిద్దలూరు శాసన సభ్యునిగా అశోక్‌రెడ్డి గెలుపొందారు.

2016లో చంద్రబాబు నాయుడి విజన్ మీద ఉన్న నమ్మకంతో టీడీపీలో చేరారు. ఆయన అనుకున్నట్టు గానే, పార్టీలో చేరిన అనతి కాలంలోనే గిద్దలూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా రూ.1300 కోట్లతో ప్రతి గ్రామంలో అభివృద్ధి చేశారు. తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం చూపించారు. కానీ 2019 ఎన్నికల నాటికి ముందు నుంచి తనకు అండగా నిలబడిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు అనుహ్యంగా వైసీపీలో చేరడంతో 83 వేల ఓట్ల తేడాతో భారీ ఓటమి చవిచూశారు. తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేసి వారి మనసు గెలుచుకున్నారు. ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి నిత్యం వారికి అందుబాటలో ఉన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని విజయ వంతంగా ముందుండి నడిపించారు. తన విలక్షణ శైలి, వాక్చా తుర్యంతో జిల్లాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు.

**ప్రజానాయకుడు 'ముత్తుముల'కే పట్టం**

ముత్తుముల ఎదురు చూపులకు ఫలితం లభించింది. యమరంజుగా సాగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యర్థికి చుక్కలు చూపించారు. 973 ఓట్ల తేడాతో అధికార పార్టీ వైసిపి అభ్యర్థి నాగార్జునరెడ్డిపై ముత్తుముల గెలుపొందారు. గతంలో ఎమ్మెల్యే లుగా చాలామంది ఉన్నప్పటికీ గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్ రెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగిందని ప్రజలంతా విశ్వసించారు. ఈ క్రమంలోనే గిద్దలూరు ఓటర్లు అశోక్‌రెడ్డికి పట్టం కట్టారు. గిద్దలూరును రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న ఆయన సంకల్పానికి ఈ ఐదేళ్ల పరిపాలన చక్కటి అవకాశం. అభివృద్దే లక్ష్యంగా సాగిన, సాగుతున్న ఆయన రాజకీయ ప్రస్థానం ముందు రోజుల్లో ఇంకా మెరుగా ఉండాలని, రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం సంపాదించి ముందుకు సాగాలని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# కొడుకు గెలుపు కోసం వక్రమార్గం







**మొదటి పేజీ తరువాయి**

చెందిన ఎమ్మెల్యే అడిగితే జడ్పీ వద్ద ఉన్న నిధుల నుంచి 10 శాతం మేరకు వర్కులను పెంపుదల చేయవచ్చు కానీ దర్శి నియోజకవర్గానికి మాత్రం 300 శాతం మేర పెంచి వర్కులను కేటాయించి దర్శికి సుమారు రూ.35కోట్లు అధిక ప్రయోజనం కలిగేలా చేశారు.

**కట్టుదిట్టంగా రికార్డు బిల్డప్**

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ఎలాంటి నిధుల కేటాయింపులు జరగ రాదని ఎన్నికల సంఘం ఆదేశించినప్పటికీ పక్కా స్కెచ్‌తో పనులను కేటాయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో వీటిని కేటాయించిన రికార్డు పరంగా పట్టుబడకుండా ఉండేందుకు పాత ముఖ్యఅధికారి ద్వారా పాత తేదీలతో రికార్డులలో నమోదు చేయడం జరిగింది. వైకాపాకు వీర విధేయులుగా ఉన్న కొందరు ఉద్యోగులు దర్శికి అధికంగా వర్కులు కేటాయించే రాచకార్యంలో స్వామిభక్తిని చాటుకున్నారు. జిల్లాలోని జడ్పీటిసిలకు ఎలాంటి సమాచారం లేకుండా వారితో చర్చించకుండానే భారీ స్థాయిలో దర్శికి పనులు ఎలా కేటాయిస్తారని జడ్పీటిసిలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం రచ్చకెక్కడంతో గుట్టుచప్పుడు కాకుండా నాట్ స్టార్టెట్ వర్కులను రద్దు చేసి మసి పూయాలని చూస్తున్నారు. జడ్పీ సమావేశం జరిగితే భారీ స్థాయిలో 512 వర్కులు ఎలా దర్శికి కేటాయించారని సభ్యులు ప్రశ్నించడంతో పాటు మారిన ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించే అవకాశాలు ఉండటంతో పాత అధికారని ప్రసన్నం చేసుకోనే పనిలో జడ్పీ నేతలు ఉన్నారు. దర్శికి అధికంగా పనులు కేటాయించే విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించిన సిబ్బంది పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఈ సమస్య నుంచి బయటపడేందుకు చీమకుర్తిలో రహస్య సమావేశం ఏర్పాటు చేసుకుని సుదీర్ఘంగా చర్చించారు.

**ఎన్నికల్లో డబ్బుల పంపిణీ కోసం ప్లాన్**

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయాలంటే భారీగా ఖర్చు అవుతుందని భావించిన వైకాపా నేతలు ఈస్కామ్‌కు తెరలేపారు. దర్శి నియోజక వర్గంలోని ప్రతి మండలానికి జడ్పీ నుంచి 5 నుంచి 10 లక్షల రూపాయల వర్కులు కేటాయించారు. ఇందులో సిడి వర్కులు, రోడ్డులు, సిసి డ్రైన్స్, బిటి రోడ్లు, మౌలిక వసతులు అంటూ విభజించి కేటాయింపులు చేశారు. ఎన్నికల్లో స్థానికంగా ఓటర్లను ప్రభావితం చేసే నాయకులకు ఆ వర్కులను కేటాయించడం జరిగింది. నామినేటెడ్ ప్రాతిపదికన వర్కులు పొందిన నాయకులు తూతూమంత్రంగా పనులు చేసి నిధులు సమకూర్చుకొని ఎన్నికల్లో వైకాపా అభ్యర్థికి పనిచేసే విధంగా పథకం రచించారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ఏ నియోజకవర్గానికి కేటాయించని విధంగా 512 వర్కులను దర్శికి కేటాయించడంపై జడ్పీ సభ్యులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో పాటు విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేస్తుండటంతో దీని వెనుక భాగోతం నడిపిన అధికారులు, ఉద్యోగులు చిక్కుల్లో పడ్డారు.







# ఘనంగా రంగభూమి కళాకారుల నాటకోత్సవాలు





ఒంగోలు, మేజర్‌న్యూస్: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ శనివారం జరుగుతున్నటువంటి సాంస్కృతిక కార్యక్ర మాల్లో భాగంగా 84వ నెల కార్యక్రమాలు నేడు శనివారం సాయంత్రం నుండి ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా జరిగాయి. ముందుగా నటరాజ స్వామి చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. ప్రముఖకీ బోర్డు ప్లేయర్ యస్.కే బాబు ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరిలో గాయని గాయ కులు పాడినటువంటి పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆ తరువాత జరిగిన సభలో ఈ నెలలో మరణించినటువంటి కళాకారులను గుర్తు చేసుకునేటువంటి కార్యక్రమం జరిగింది. తదుపరి చందు డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకు న్నాయి.

**జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కు ఘన సన్మానం**

ఇటీవల జరిగిన ఎన్నికలలో దామచర్ల జనార్ధన్ విజయానికి కృషి చేసిన జన సేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కి జిల్లా రంగభూమి కళాకారుల సంఘం వారిచే ఘన సన్మానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా రంగభూమి అధ్య క్షులు బేతంశెట్టి హరిబాబు ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య, సహకారదర్శి ఏల్చూరి అనంతలక్ష్మి, యం.వి.వి. పి.బాబు రావు, దిగ్విజయ్, మాకా ఆంజనేయులు, జాలాది మోహన్, కె.వి.రంగారావు, నల్లమల్లి పాండు రంగనాథ్, తులసి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావు మృతిపై మాగుంట సంతాపం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈనాడు సంస్థల అధినేత చెరు కూరి రామోజీ రావు మృతి పట్ల ఒంగోలు శాసనసభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సంతాపం తెలియజేశారు. ఈనాడు, రామోజీ ఫిలిం సిటీ, ఈటీవీ, మార్గదర్శి అధినేత, ఉషా కిరణ్ మూవీస్, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత, వ్యాపార, పత్రిక రంగంలో ప్రముఖ పాత్ర పోషించి లక్షలాది మందికి ఉపాధి కలిగించిన చెరుకూరి రామోజీరావు మరణ వార్త ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. వారి కుటు ంబానికి మాగుంట ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# నీట్‌లో శ్రీ వశిష్ఠ విద్యార్థుల ప్రభంజనం




ఒంగోలు, మేజర్‌న్యూస్:

నీట్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ వశిష్ఠ మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 52 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 21 మంది విద్యార్థులకు ఎంబిబిఎస్ సీట్లు, 14 మంది విద్యార్థులకు బిడిఎస్ సీట్లు, 4 మంది విద్యార్థులకు వెటర్నరి సీట్లు వచ్చినట్లు అకాడమీ డైరెక్టర్ ఎన్. శ్రీకాంత్ తెలియజేశారు.

720 మార్కులకు గాను విద్యార్థులు పి. రోహిత్ బాబు (611), ఎస్‌కె ఖాజా అఫిద్ (600) 500పైగా 18 మంది విద్యార్థులు మార్కులు సాధించారు. ప్రతిభ చూపించిన విద్యార్థులకు డైరెక్టర్ ఎన్. శ్రీకాంత్, అకాడమి ఏవో కె. సురేష్ బాబు, ప్రిన్సిపల్ కృష్ణ ప్రియ అభినందనలు తెలియజేశారు.

## ప్రపంచ సాగర దినోత్సవం



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: సముద్రాలు మానవాళికి మహోపకారం చేస్థాయి. భూ వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంలో అద్భుతమైన పాత్రను పోషిస్తాయి. బొగ్గు పులుసు వాయువును శోషించుకుని, ప్రాణవాయువును మనకు అందిస్తాయి. భూతాపాన్ని నియంత్రిస్తాయి.ఇవి జీవ వైవిధ్యానికి పట్టుగొమ్మలు. ఎన్నో రకాల జీవులు, జంతువులకు ఆవాసాలు. ఇవి భూగోళానికి ఊపిరితిత్తులు. కోట్లాది రూపాయల విలువైన వనరులను అవి మనకు అందిస్తాయి. మానవాళికి ఎంతగానో ఉపయోగపడే సముద్రాలను మనం కలుషితం చేస్తున్నాము. వాటిని ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేస్తున్నాం ఫలితంగా ఎన్నో జీవరాసులు అంతరిస్తున్నాయి.దీనివల్ల జీవ వైద్యం దెబ్బతింటుంది సముద్రాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.ప్రపంచ సాగర దినోత్సవం సందర్భంగా శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎస్ ఎం జి బాలికల ఉన్నత పాంశాల లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సము ద్రాలను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమ ంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, హెచ్‌ఎం టి రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏ పి ఎంఎల్ ఏ లలో 79%నేర చరితులు ఎంపీలను మించిపోయిన ఎమ్మెల్యేలు



బాపట్ల, మేజర్‌న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ లో నూతనంగా ఎన్నికైన ఎంఎల్ఏ లలో 79 శాతం మంది నేర చరితులుగా ఉన్నారు. అందులో 56 శాతం మంది తీవ్రమైన నేరారోపణ లను ఎదుర్కొంటున్నారు. ఏపి ఎంఎల్ఏ ల నేర చరిత్ర 2014వ సంవత్సరం నుండి క్రమేపి పెరుగుతూ వస్తున్నది. 2014లో 49 శాతం మంది నేరచరితులు గా ఉంటే, 2019లో 55 శాతం మంది నేరచరితులు ఉన్నారు. ప్రస్తుతం 2024లో అది 79 శాతానికి పెరగడం విశేషం. బిజెపి ఎంఎల్ఏ లలో 88 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉండగా టిడిపి ఎంఎల్ ఏ లలో 86 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ ఎంఎల్ ఏ లలో 55 శాతం, జనసేన ఎంఎల్ఏ లలో 48 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారు. ఏ పి ఎంఎల్ ఏ లలో 93 శాతం మంది కోటీశ్వరులు. వీరి సగటు ఆస్తి విలువ రు.65.07 కోట్లుగా ఉంది. ఇది జాతీయ ఏంపీ ల సగటు కంటే చాల ఎక్కువ అని తెలియజేశారు డా. పిసి సాయిబాబు బాపట్ల ఫోరం కార్యదర్శి.

## ఘనంగా రేణుకమ్మతల్లి ప్రధమ వార్షిక వేడుకలు



కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం పంచాయతీ ఎం వి రాజుపాలెంలోని పిట్ల వారి ఇలవేల్పు శ్రీ రేణుకమ్మ తల్లి ప్రధమ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి ఘనంగా పిట్ల వారి గోత్రికులు పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మరాజు అమ్మ వారికి జరిగిన ప్రత్యేక పూజలతో పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి, పిట్ల వసంతరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి,ఎర్ర శ్రీనివాసరెడ్డి ,అట్ల వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి: జోసఫ్ సుధీర్ బాబు



బాపట్ల, మేజర్‌న్యూస్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, బాపట్ల జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఐఎస్టిఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల విధులకు అనారోగ్య రీత్యా హాజరుకాని ఉపాధ్యాయుల సస్పెన్షన్లను మానవతా దృక్పథంతో ఎత్తివేయాలని, నాసిరకమైన జేవీకే కిట్లను విద్యార్థులకు సరఫరా చేసి అనేక అవకతవకలకు పాల్పడిన, అక్రమ బదిలీలు దగ్గరుండి చేయించిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పై విచారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవీణ్ ప్రకాష్ గత ప్రభుత్వ కాలంలో అన్యాయంగా చేసిన ఉపాధ్యాయుల సస్పెన్షన్ లు, మెమోలు, పెండింగ్ చార్జ్ మేమోలను వెంటనే రద్దు చేయాలనీ, నూతన విద్యా విధానంను పునఃపరిశీలన చేయాలని, జీవో 117 రద్దు చేయాలని,కొత్త ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వెంటనే ఐ ఆర్ ప్రకటించి, రిటైరైన ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పదవి విరమణ ప్రయోజనాలు చెల్లించాలని నూతన ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమరనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేసే సంఘం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అని, ఉపాధ్యాయులు అందరూ ఎస్టీయు సభ్యులు కావలసినదిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చందు వెంకటేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్లు గుగ్గిలం ఉదయ శంకర్, చందా నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నూరుబాషా సుభాని, బత్తుల నాగరాజు, ముజఫర్ జానీ, ఆసిఫ్ అలీ, శివాంజనేయులు, జి రమేష్ బాబు, కరీముల్లా, ప్రసాద్, ఏసురత్నం, ఓ శ్రీనివాసరావు, ఏవీ నారాయణ, నర్రా సుబ్బారావు, హర్షదుల్ల బేగ్, పి ఎస్ వి ప్రసాద్, రాజేంద్ర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావు అకాల మరణానికి చింతిస్తున్న టీడీపీ నాయకులు



పొదిలి, మేజర్‌న్యూస్: ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీ రావు మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మ కు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ, స్థానిక పొదిలి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించటం జరిగింది. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీ కాటూరి వెంకట నారాయణ బాబుగారు, మాజీ ఉపసర్పంచ్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఖు ద్దుస్ గారు, మైనారిటీ సెల్ అధ్యక్షులు రసూల్ గారు, మహిళా నాయకురాలు శ్రీదేవి గారు మాజీ ఎంపీటీసీ నరసింహ రావు గారు, మాజీ వార్డు మెంబర్ షాహిద్ గారు పట్టణ కార్యదర్శి శ్రీను గారు శివాలయం మాజీ చైర్మన్ నాగేశ్వరరావు గారు, లీగల్ సెల్ నాయకులు షబ్బీర్ గారు, మహిళా నాయకురాలు షాహనాజ్ గారు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామోజీరావుకు ఘన నివాళి



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మండవ జయంత్ బాబు ఆధ్వర్యంలో మండల, గ్రామాల తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి అలుపెరగని అక్షర యోధుడు, పద్మ విభూషణ్, ప్రజాపక్షపాతి, చెరుకూరి రామోజీరావుకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మాట్లాడుతూ రామోజీరావు తెలుగు వారి గొప్పతనాన్ని, దేశ,రాష్ట్ర రాజకీయాల సమాచారాలను పామరులకు అర్థమయ్యే రీతిలో ఈనాడు దినపత్రిక ద్వారా, ఈనాడు టీవీ చానల్స్ ద్వారా మంచిగా అందించాడు. అన్నదాత పుస్తకాల ద్వారా, బుల్లితెరల ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని అందించాడని, వారి ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవభక్తుని ప్రసాద రావు, మండవ గోపీ చంద్, పోకూరి శ్రీనివాసరావు, రావి నరసింహారావు, రావి శేషయ్య, అన్నమనేని సుబ్బారావు, కొమ్మాలపాటి సుబ్బారావు, తాతపూడి నాగరాజు, ఎద్దు రాంబాబు, బోడపాటి రామకృష్ణ, నాదెండ్ల తారక రామారావు, బోడెంపూడి సత్యనారాయణ, మర్నేని సుబ్బారావు, రావి నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, నాయుడు భానుచందర్, మల్లిపెద్ది బాలకృష్ణ, ముళ్ళూరి మురళి, రావి మహేష్, మొనపాటి రామకృష్ణ, గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

## గుణదల మేరీ మాత చర్చికి టిడిపి కార్యకర్తలు పాదయాత్ర



పంగులూరు, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ మెజారిటీ సాధించి చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయబోతున్న సందర్భంగా,శాసనసభ్యుడుగా గొట్టిపాటి రవికుమార్ ఐదవ సారి విజయవంతంగా గెలవడం పట్ల మండలంలోని ముప్పవరం గ్రామంలో గల ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్తలు శనివారం పాదయాత్రగా గుణదల మేరీ మాత ఆలయానికి బయలుదేరారు. ముందుగా ముప్పవరం లోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడినుండి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ ,రాష్ట్రంలో ప్రజా పరిపాలన మళ్లీ మొదలు కాబోతుందని అన్నారు. అద్దంకి నియోజకవర్గం ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి గొట్టిపాటి రవికుమార్ ను మరోసారి శాసనసభ్యుడిగా భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. పేద వర్గాల అభివృద్ధి కోసం పనిచేసే చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నాడని ,రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా గుణదల మేరీ మాత ఆలయానికి పాదయాత్రగా బయలుదేరుతున్న దళిత యువకులను ఆయన అభినందించారు. పాదయాత్రలో చింతల నాగేశ్వరరావు, దుడ్డు మత్తయ్య, వేల్పుల మరియదాస్ ,వేల్పుల అశోక్, చింతల డేవిడ్ పాల్, అద్దేపల్లి ఏసుబాబు, వేల్పుల ఏసుబాబు, కొమ్ము డేవిడ్, అద్దేపల్లి వందనం, అద్దేపల్లి రవీంద్ర, అంజయ్య, తాతపూడి వందనం ,తదితరులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్, మండల తెలుగుదేశం నాయకులు అల్లం లేని బ్రహ్మానంద స్వామి, తెలుగుదేశం పార్టీ అద్దంకి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు, నాయకులు గరిమిడి జగన్ మోహన్ రావు, దూళిపాళ్ల భావనారాయణ, వీరాంజనేయులు, శంకర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి మృతి

బాపట్ల రూరల్, మేజర్ న్యూస్: బాపట్ల మండలం మూలపాలెం పంచాయితీ గాదె వెంకట్ రెడ్డి కాలనీ చెందిన నలుగురు వ్యక్తు లు వాహన కొనుగోలుకు పొన్నూరు బయలుదేరగా మార్గమధ్యంలో నాగరాజు కాలువ సమీపాన వేగంగా వెళుతూ అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలు మరొకరు మృతి. జీవన్, నవీన్, శ్రీకాంత్ అనువారు ఒక మోటార్ సైకిల్ పైన, పవన్ కుమార్ అంకమ్మ రావు ఇద్దరు ఏపీ 40 బి డి 5692 అను నంబరు గల బండి పైన బయలుదేరగా, యార కాలువ దాటి కొద్దిగా ముందుకు వెళ్ళగా సదరు బండి నడుపుతున్న పవన్ కుమార్ అతి వేగంగా అజా గర్తగా నడిపి చెట్టుకు గుద్దటం వలన వెనుక కూర్చొని వున్న అంకమ్మ రావు కి దెబ్బలు తగల టం వలన బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి కి చేర్పిం చగా డాక్టర్ పరీక్షించి చనిపోయినట్లు గా నిర్ధారించారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన అంబటి గిరిధర్



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించి మొక్కను బహుకరించిన వీజీఆర్‌ఎం ఇంటర్ కళాశాల అధినేత అంబటి గిరిధర్. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో వడ్రానం బ్రహ్మం నాయుడు, కారుమూరి ఆంజినేష్ నాయుడు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా సీనియర్ పురుషులు మహిళల రగబ్బి జట్ల ఎంపికలు

కర్లపాలెం, మేజర్‌న్యూస్: కర్లపాలెం పి కె ఆర్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణ ంలో బాపట్ల జిల్లా రగ్బి అసోసియేషన్స్ వారి ఆద్వర్యంలో సినియర్ పురుషుల , మహిళల రగబ్బి జట్టు ఎంపికాలు జరుగుతాయని బాపట్ల జిల్లా రగబ్బీ అసోసియేషన్స్ సెక్రటరీ పిట్టు సుబ్బారెడ్డి తెలిపారు. సెలక్షన్ కు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికేటిను తమ వెంట తీసుకురా వాలని చెప్పారు. ఎంపిక కాబడిన బాపట్ల జిల్లా సినియర్ పురుషుల, మహిళల రగబ్బి జట్టును ఈ నెల 15 నుండి 16 వరకు బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల లో పాల్గొంటారని ,మరిన్ని వివ రాలకు ఫోన్ నెంబర్ 7702561907 ను సంప్రదించాలని బాపట్ల జిల్లా రగబ్బిఅసోసి యేషన్ సెక్రటరీ పిట్టు సుబ్బారెడ్డి తెలియజేశారు.

# ఇంటూరికి శుభాకాంక్షలు వెల్లువ

కందుకూరు, మేజర్ న్యూస్ : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు వస్తున్న వారితో గత నాలుగు రోజులుగా కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం కిటకిటలాడుతోంది. వివిధ వర్గాల ప్రజలు, తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు. పుష్పగుచ్చాలు అందిస్తూ శాలువాలతో సత్కరిస్తున్నారు. కందుకూరు పట్టణంలోని పలువురు ముస్లిం సోదరులు, నాగేశ్వరరావు చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలాం, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, నెల్లూరు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి షేక్ ఫిరోజ్, షేక్ ఇశ్రాని, రూబీ, ఖాదర్బాషా, గౌస్ బాషా, అమీరుల్లా, వలి, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో మాలకొండలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. కందుకూరు పట్టణానికి చెందిన తొట్టెంపూడి రమణ ఆధ్వర్యంలోనూ 101 కొబ్బరికాయలు కొట్టారు.







# ఇంటూరి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు

**- పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపిన పువ్వాడి**

పామూరు, మేజర్ న్యూస్ : కందుకూరు టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవడంతో టిడిపి



మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తిరిగి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం శుభపరిణామం




అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, టిడిపి మండల నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు (బిల్డర్), తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు, గోళ్ళ వెంకటేశ్వర్లు, బొట్లగూడూరు ఐ టిడిపి కో ఆర్డినేటర్ కోటపాటి రాము, కంచర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# ఎమ్మెల్యే స్వామికి అభినందన వెల్లువ

టంగుటూరు, మేజర్‌న్యూస్: కొండేపి టిడిపి ఎమ్మెల్యేగా మూడోసారి ముచ్చటగా విజయదుందిబి మ్రోగించిన డాక్టర్ డోలశ్రీ బాల వీరాంజనేయ స్వామికి టంగుటూరు టిడిపి నాయకులు అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు కామని విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొండేపి నియోజకవర్గంలో మూడుసార్లు ఒకే ఒక్క వ్యక్తి గెలిచిన ఘనత స్వామికి దక్కుతుందని తెలిపారు. రాష్ట్ర మంత్రి సురేష్‌ను ఓడించి టిడిపికి



కొండేపిలో ఉన్న పట్టు ఏంటో నిరూపించారు అని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాల వారు ఏకత్రాటిపై వచ్చి వైకాపాన్ని ఓడించాలని కంకణం కట్టుకొని ఎమ్మెల్యేగా డాక్టర్ స్వామిని గెలిపించారని తెలిపారు. కాబోయే మంత్రివర్గంలో ఎమ్మెల్యే స్వామికి మంత్రి అవ్వడం ఖాయమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ స్వామి మాట్లాడుతూ టంగుటూరు మండలంలో ప్రతి టిడిపి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి తనను గెలిపించారని తెలిపారు. ముఖ్యంగా మండల పార్టీ అధ్యక్షులు కామని విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు బెదవాడ వెంకటేశ్వర్లు ఇతర నాయకులు చేసిన కృషి మరువలేనని తెలిపారు. పార్టీ విజయాన్ని కృషి చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ ఎప్పుడుగా అండగా ఉంటుందని తెలిపారు. మరోపక్క దామచర్ల కుటుంబం తోపాటు దామచర్ల సత్య తన గెలుపుకు ఎనలేని కృషి చేసినందుకు అభినందన తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యే స్వామికి శాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మక్కిన హరిబాబు, కుందేటి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, యజమాని, మక్కిన కోటేశ్వరరావు, సురేషు, విక్కీ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# రామోజీరావు వ్యక్తి కాదు... సమూహ శక్తి

**- ఎమ్మెల్యే గొట్టిపాటి**

అద్దంకి, మేజర్‌న్యూస్: రామోజీరావు వ్యక్తి కాదు... సమూహ శక్తి అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు.హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీ లో ఉన్న రామోజీరావు పార్థివ దేహానికి ఆయన నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పత్రికాధిపతిగా, చలనచిత్ర నిర్మాతగా, స్టుడియో



అధినేతగా ఎన్నో వ్యవహారాలు నిర్వహిస్తూ మచ్చలేని మనిషిగా ఎదిగాడన్నారు. ప్రకృతి విలయ తాండవం చేసిన సమయంలో తన వద్ద పని చేసే సిబ్బందిని పురమాయించి పేదలకు అండగా నిలిచాడన్నారు. ఈతరం వారికి ఆయన సేవలు తెలియనప్పటికీ పెద్దవారికి రామోజీరావు సేవలు తెలుసన్నారు. ఛిట్ ఫండ్ రంగాన్ని ప్రజలకు పరిచయం చేసి పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఇంతటి మహనీయుడిపై కూడా వైకాపా ప్రభుత్వం మానసిక వత్తిడి పెంచి వేధించిన అంశాన్ని ప్రజలు గుర్తుంచుకున్నారన్నారు. ఎనిమిది పదుల వయసు లోనూ ఎవ్వరికీ తలవంచని ఆయన్ను వైకాపా ప్రభుత్వం అప్రతిష్ట పాలుచాయాలని ప్రయత్నించిందన్నారు. ఫలితంగా తెలుగు ప్రజలకు వైకాపా నేతలు దూరం అయ్యారని గుర్తు చేశారు. రామోజీరావు లేని లేటు పూడ్చలేనిదనీ అన్నారు.

# ఎంఎం కొండయ్యకు శుభాకాంక్షలు

చీరాల, మేజర్ న్యూస్: ఉమ్మడి కూటమి శాసన సభ్యుడు మద్దులూరి మాల కొండయ్యకు ప్రజా వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి ఏసురత్నం శుభాకాంక్ష లు తెలిపారు. స్థానిక కొత్తపేట బైపాస్ పక్కన ఉన్న పార్టీ



కార్యాలయంలో శనివారం గుమ్మడి ఏసురత్నం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను మర్యాద పూర్వకంగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా గుమ్మడి ఏసురత్నం ఎంఎం కొండయ్యకు పుష్ప గుచ్ఛం అందజేసి, విజయ ధుంధభి మోగించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి చిట్టి, గుమ్మడి సూర్యప్రకాష్, వెళ్ళంపల్లి ధనరాజ్, సలగల రూబెన్ తదితర ప్రజా వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# దామచర్లకు పువ్వాడి అభినందనలు

పామూరు, మేజర్‌న్యూస్: టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందిన దామచర్ల జనార్ధన్ రావుకు టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. టిడిపి రాష్ట్ర



ఉపాధ్యక్షులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా ఒంగోలులోని దామచర్ల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు ముక్తకంఠంతో వైసీపీ ప్రభుత్వానికి స్వస్తి పలికి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం, రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్క ఓటరు విజ్ఞతతో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. కనీసం ప్రతిపక్ష హెూదా కూడా దక్కని స్థాయిలో ప్రజలు వైకాపాకు గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇన్చార్జులు అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, టిడిపి మండల నాయకులు పువ్వాడి రామారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు(బిల్డర్), తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు, గోళ్ళ వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుల ఆధ్వర్యంలో రామోజీరావుకు అశ్రునివాళి

**- పత్రికా రంగానికి తీరని లోటు**
**- మీడియా రంగంలో రామోజీరావు చెరగని ముద్ర వేసుకున్నారు**
**- భావోద్వేగానికి గురై కన్నీరు కార్చిన స్థానిక ఈనాడు ప్రతినిధి బాజి**

పొదిలి మేజర్ న్యూస్ : విలేకరుల ఆధ్వర్యంలో రామోజీరావు ఆకస్మిక మరణానికి చింతిస్తూ శనివారం సంతాపసభ ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకొని మొట్టమొదట రంగుల పేపర్ నుంచి జిల్లా ఎడిషన్ ప్రారంభించి స్థానిక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి వెళ్ళేటట్లు చేసారని తెలిపారు. నిబద్ధత,నైతిక విలువలు ప్రాధాన్యత ఇస్తు మీడియా తెలుగు పాఠకులను ఆకట్టు కొలిగలిగారని తెలిపారు. ఎంతో మందికి ఉపాధి కల్పించి వారి కుటుంభాలు గౌరవప్రదంగా సమాజంలో బ్రతికేందుకు క్రమశిక్షణ తో కుడిన శిక్షణ ఇచ్చినట్లు వారు తెలిపారు. తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పొదిలి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ముల్లా హాసన్ వలి (బడే ) ముప్వ వెంకటేశ్వరరెడ్డి,నర్రవెంకటేశ్వరరెడ్డి,చప్పిడి శ్రీను,శివాజి, అహమ్మద్, రామారావు,బాజి, ప్రజాశక్తి బాల నరసయ్య ,భాను



చందర్,సుబ్బారావు,మాదార్, విశ్వనాథ్, కొండలు, ప్రశాంత్ తదితరులు పాల్గొనీ శ్రద్ధాంజలి ఘటించారు.

# అక్షరయోధుడు రామోజీరావు అస్తమయం



## జర్నలిస్టులు, సంఘ నేతలు దిగ్భ్రాంతి, ఘన నివాళి
## కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి
## టిడిపి కార్యాలయంలో సంతాప సభ
## ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యేలు దామచర్ల, ముత్తుముల, బీఎన్, జనసేన రియాజ్, ఎరిక్షన్ బాబు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతిపై జర్నలిస్టు సంఘాలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జర్నలిస్టు సంఘాలే కాకుండా రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలు సంతాప సభలు ఏర్పాటు చేసి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

### ఒంగోలు టిడిపి కార్యాలయంలో....

ఒంగోలు నగరంలోని టిడిపి కార్యాలయంలో ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు సంతాప సభను ఏర్పాటు చేశారు. ఒంగోలు ఏమ్మెల్యే దామచర్ల జనార్దన్, గిద్దలూరు ఏమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, సంతనూతలపాడు ఏమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్, వైపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ పత్రిక, టీవీ, సినిమా రంగాల్లో తనదైన ముద్రవేసి తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేసిన చెరుకూరి రామోజీరావు మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ఈనాడు పత్రిక స్థాపన ద్వారా మీడియా రంగంలో నూతన్య అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. రామోజీరావు మృతి తెలుగువారికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో....

ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం తీరని లోటని సూర్య పత్రికా జిల్లా బ్రాంచ్ మేనేజర్, ఏపిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నాడు ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్ బాబు నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి గొట్టిపాటి నాగేశ్వరరావుతో పాటు పలు జర్నలిస్ట్ సంఘాల నేతలు, జర్నలిస్టులు పాల్గొని రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రపంచానికి తెలుగు అక్షరం పరిచయం చేసిన వ్యక్తి రామోజీరావు అని గుర్తు చేశారు. జర్నలిస్టు రంగంలో ఎంతో మందికి ఉపాధి కల్పించి మార్గదర్శి అయ్యారని అన్నారు. ఈ సందర్భంగా రామోజీరావు సమాజానికి చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్ బాబుతో ప్రజాశక్తి బ్యూరో బ్రహ్మం, ఐ 9 న్యూస్ కిరణ్, ఈనాడు సురేష్, గౌరవ అధ్యక్షులు అంగలకుర్తి ప్రసాద్, కార్యదర్శి ఒంగోలు వసంత్ కుమార్, కోశాధికారి సూర్య కోటయ్య, కార్యాలయ కార్యదర్శి ఇమ్మానుయేలు (వెస్ప), మక్కెన రత్నం (బుజ్జి),తదితరులు పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఏంసిఏ, ఏపిఈజేయు ఆధ్వర్యంలో...

శనివారం ఒంగోలు ఎమ్సివి భవనం నందు ఈనాడు పత్రిక అధినేత రామోజీరావుకి సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్సివి అధ్యక్షులు వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిధిగా ఎపిఇజెయు రాష్ట్ర నాయకులు మేకపాటి మాల్యాద్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా రామోజీరావుకి జర్నలిస్టు లందరూ ఘననివాళులు అర్పిం చారు. వి.నాగేశ్వరరావు మాట్లా డుతూ ఈరోజు దేశం ఒక అక్షర యోధున్ని కోల్పోయిందని ఇది జర్నలిస్టులందరికి చాలా బాధకర మైన విషయం అని తెలిపారు. ముఖ్యఅతిధి మేకపాటి మాల్యాద్రి మాట్లాడుతూ 1974లో ఈనాడు దినపత్రికను స్థాపించి నప్పటి నుండి ప్రజల సమస్యలను గురించి ప్రభుత్వాలను చైతన్యం చేయడంలోను, ప్రశ్నించడంలోను తన శైలిలో పోరాటం జరిపిన అక్షరయోధుడు శ్రీ చెరుకూరి రామోజీరావు గారు అంతేకాకుండా చిత్రనిర్మాణం టెలివిజన్ రంగంలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టి అనేక వేల మందికి మార్గదర్శకుడిగా ప్రపంచప్రఖ్యాతమైన రామోజీ ఫిల్మిసిటీని నిర్మించి తెలుగు జాతికి ఘనకీర్తి చేకూర్చిన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్రీనివాసరావు, కళాంజలి సుబ్బారావు, ఉబ్బా అశోక్, కె.మల్లేశ్వరీ, యం. రామ కృష్ణ, ఈర్ల శ్రీనివాసరావు, బి.సంజీవరావు, యస్.కె.కాలేషావలి, పి.ఏడు కొండలు, యం.సాంబశివరావు, పి.ప్రతాప్రెడ్డి, సి.హెచ్. అశోక్, కోరుకొండ సుబ్బారావు, పి.బాబు, జె.మారుతీ, అంగలకుర్తి ప్రసాద్, యస్.కె. హ్యూమయున్ బాషా, కె. హరిబాబు, ఎన్. సాయిరెడ్డి, ఆంజనేయులు, ఎపి ఇజెయు అధ్యక్షులు పి.శేషు, పి9 రిపోర్టర్ కంచర్ల శివకుమార్, షేక్ హసన్ తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో...

తెలుగు పత్రికారంగానికి దిశానిర్దేశం చేసిన దార్శనికుడు చెరుకూరి రామోజీరావు అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. రామోజీరావు అకాలమరణానికి చింతిస్తూ ప్రకాశం జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. రామోజీరావు నిలువెత్తు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుల షేక్ మహబూబ్ జాన్, కార్యదర్శి హుమయున్ బాషా, ఆనందమయి సంగీత సాహిత్య సేవా సమితి ప్రధాన కార్యదర్శి అన్ను విజయకుమారి, విశ్వకళాభారతి అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ, పద్యసార్వసత పరిషత్ ప్రధాన కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు, ఎర్రన్న సాహిత్యపరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, లలిత కళ అకాడమి అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, కనిగిరి సాహితీ సుధ ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు చిలకపాటి వెంకట రంగారావు, సాహితీవేత్తలు ఆది మూలపు సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, పొన్నలూరి జానకీరామ్, అడ్వ కేట్ రవి, ధూళిపాళ్ల కృష్ణప్రసాద్, బెల్లం అనిల్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

### టిడిపి జిల్లా కార్యాలయంలో.....

తెలుగు మీడియా మొఘల్ గా వినుతికెక్కిన ఈనాడు పత్రిక అధిపతి చెరుకూరి రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ సంతాపం వ్యక్తపరిచారు. అటు పత్రికా, ఇటు ఎలక్ట్రానిక్ మీడియా రంగాలను వినూత్న రీతిలో తీర్చి దిద్దిన అక్షరయోధుడని రామోజీకి నూకసాని నివాళి అర్పించారు. రామోజీ నిష్క్రమణతో తెలుగు పత్రికా రంగం ఒక దిక్సూచిని కోల్పోయినట్లు అయిందని, వివిధ సంస్థల ఏర్పాటు ద్వారా అటు రాష్ట్రంలోనే కాక దేశంలో ఎంతో మందికి ఉపాధి కల్పించారని నూక సాని అన్నారు. తెలుగు పత్రికా రంగానికి జవసత్వాలు చేకూర్చేలా వృత్తి విలువలు, ప్రమాణాలు, భాషా నైపుణ్యాల పెంపుదలకు నిరంతరం శ్రమిస్తూ, వేలాదిమంది పాత్రికేయులను పత్రికా లోకానికి అందించిన ఘనత రామోజీకే దక్కుతుందని నూకసాని పేర్కొన్నారు.



### జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో....

జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం కార్యాలయంలో పత్రికా అధినేత రామోజీరావు అకాల మృతికి సంతాప సూచికంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పట్టణంలోని కళాకారులు, పలువులు కళాసంస్థలు ప్రతినిధులు ఆయనకి ఘనంగా నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రంగస్థల నటులు, నంది అవార్డు గ్రహీత ధేనువకొండ సుబ్బయ్య మాట్లాడుతూ విలువలతో కూడిన పత్రికను నడిపి, అలాగే టీవీ రంగంలో పాడుతా తీయగా అనేటువంటి కార్యక్రమం ద్వారా ఎందరో గాయని గాయకులను సినిమా పరిశ్రమకు పరిచయం చేసినటువంటి మంచి మనసున్న కళాభిమాని శ్రీరామోజీరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగభూమి ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాదు, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి ఆల్ ఇండియా కళా రంగం జిల్లా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, ప్రముఖ గాయకురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, కీ బోర్డు ఆర్టిస్ట్ ఎస్. కె. బాబు, పౌరాణిక నటులు కొప్పోలు వేంకటేశ్వర్లు కీ బోర్డు ఆర్టిస్ట్ ఏర్మియ తదితరులు పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించారు.

### రామోజీరావుకి గ్రామీణ వైద్యుల నివాళి....

ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామోజీరావు మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటు, రామోజీరావు గారు తెలుగు వారికి చేసిన సేవలు మరువలేవని ప్రకాశం జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు బాలాజీ, జిల్లా కార్యదర్శి కె.బాలచంద్రం, గౌరవ అధ్యక్షులు వేముల మాల కొండయ్య, జిల్లా మీడియా ఇన్చార్జి దాసరి సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

### న.ర.సం కార్యాలయంలో...

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు దివంగతులు కావటం తెలుగు జాతికి తీరని లోటని కవులు, రచయిత్రులు తమ సంతాప సందేశాలలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నరసం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ ఈనాడు పత్రికలో వసుంధర ద్వారా అనేక వేలమంది మహిళా ప్రతిభా మూర్తులను సమాజానికి పరిచయం చేసిన మహిళ బంధు, తెలుగు భాషకు ఎంతో సేవ చేసిన అక్షర యోధుడు రామోజీరావు అన్ని రంగాలలోనూ విజయాలు సాధించిన విశిష్ట వ్యక్తి అంటూ అభినందించారు. ఈ కార్యక్రమ ంలో నరసం రాష్ట్ర ఉపాధ్య క్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, డాక్టర్ నూనె అంకమ్మ రావు, కుర్రా ప్రసాద్ బాబు, మారేపల్లి సూర్య కుమారి, నెమ్మాని సీతారామ మూర్తి, యు. వి.రత్నం, బీరం అరుణ, కె.శాంతిలత, మహిళా భ్యుదయ సమితి సభ్యులు తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

### విద్యార్థి యువజన జేఏసీ ఆధ్వర్యంలో....

పత్రికా ప్రకటన ప్రపంచానికి తెలుగు అక్షరం పరిచయం చేసిన ఈనాడు అధినేత చెరుకూరి రామోజీ రావు మరణం తీరని లోటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రాయపాటి జగదీష్ విచారం వ్యక్తం చేశారు. సంతాప సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సామాజిక వేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ చెరుకూరి రామోజీరావు సేవలు చిర స్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విద్యార్థి జేఏసీ విడతల కరుణాకర్, నగర అధ్యక్షులు శ్రీకృష్ణ సూర్య, ప్రకాష్, లోకేష్, శ్రీనివాస్, సాయి, సురేంద్ర, రాజు, తదితరులు పాల్గొన్నారు.



## అక్షర యోధుడికి నివాళులర్పించిన టీడీపీ శ్రేణులు



కనిగిరి, మేజర్‌న్యూస్: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి పట్ల అమరావతి గ్రౌండ్స్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మనేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పత్రిక, సినీ, టీవీ రంగాలలో రామోజీరావు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య విజయాలు సాధించారని టీడీపీ శ్రేణులు కొనియాడారు. ఈనాడు గ్రూపు సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీ తెలుగు రాష్ట్రాలకు దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలుగు వారి జీవితాల్లో అత్యంత ప్రభావవంతమైన ముద్ర వేసిన రామోజీరావు తెలుగు ప్రజల ఆస్తి అని.. ఆయన మరణం రాష్ట్రానికే కాదు, దేశానికి కూడా తీరని లోటన్నారు. ఎన్నో సవాళ్ళను, సమస్యలను అధిగమించి ఎక్కడా తలవంచకుండా సంస్థలను నడిపిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. మీడియా రంగంలో ఒక శిఖరం అని ఆయన ఇకలేరు అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమళ్ళ శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మనేని వెంకటరెడ్డి, ఐవి నారాయణ, చింతలపూడి తిరుపాలు, షేక్ జంషీర్, గుడిపాటి ఖాదర్, షేక్ అహ్మద్, బుల్లా బాలబాబు, కాసుల శ్రీరాములు, గండికోట రమేష్, షేక్ రిజ్వాన్ పాల్గొన్నారు.

## రామోజీరావుకు తెలుగు తమ్ముళ్ళు నివాళి

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: స్థానిక మండలంలోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనాడు సంస్థల అధినేత కీర్తిశేషులు స్వర్గీయ చెరుకూరి రామోజీ రావుకి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, తాతిరెడ్డి పిచ్చిరెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, హెచ్ఎం పాడు ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, యూనిట్ ఇంచార్జ్ రెడ్డం తిరపతి రెడ్డి,మండల తెలుగు అధ్యక్షులు కందుల వెంకట సుబ్బారెడ్డి, కనిగిరి నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు గాయం రామిరెడ్డి, మండల టిడిపి కార్యదర్శి చీకటి వెంకట సుబ్బయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తాతపూడి బుజ్జి, మండల బీసీ సెల్ అధ్యక్షులు కూరాకు బాలనారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు తాతిరెడ్డి వీర నారాయణరెడ్డి, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్చార్జి, నియోజకవర్గ, అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు అందరూ పాల్గొని స్వర్గీయ చెరుకూరి రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.




## అక్షర యోధుడు రామోజీకి అశ్రునివాళి

### - రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పువ్వాడి

పామూరు, మేజర్‌న్యూస్: పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు అకాల మరణం అత్యంత బాధాకరం అని టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని శేష మహల్ కాంప్లెక్స్ లోని టిడిపి కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. రామోజీరావు మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు అన్నారు. అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గుంటుపల్లి శ్రీనివాసులు, పువ్వాడి రామారావు, సయ్యద్ అమీర్ బాబు పువ్వాడి వెంకటేశ్వర్లు (బిల్డర్), దారపనేని కొండబాబు, పందిటి హరీష్, గోళ్ళ వెంకటేశ్వర్లు, గల్లా చెన్నయ్య, చావా సుబ్బారావు, గుత్తి మహేష్, ఉప్పలపాటి హరిబాబు, సాంబయ్య, గోళ్ళ వీరబాబు, మండ్ల రమణయ్య, మోబినా మౌలాలి, హజరత్, దేవరపు మాల్యాద్రి, తదితరులు రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## నాకు రాజకీయ బిక్ష పెట్టిన దేవుడు రామోజీరావు

### శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి



మార్కాపురం, మేజర్‌న్యూస్: రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్, ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు ఆదివారం తెల్లవారు జామున స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తనకు రాజకీయ భిక్ష పెట్టిన దేవుడు రామోజీరావు వారి మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. అదేవిధంగా కొన్ని వేల మందికి ఉపాధి కల్పించి ఆదర్శ ప్రాయుడిగా అందరికీ నిలిచారని అన్నారు. 2004 ఎన్నికల ముందు కంభంపాటి రామ్మోహన్రావుతో కలిసి రామోజీరావుని కలిశానని రాజకీయాల్లో ఎన్నాళ్ళు ఉన్నామనేది ముఖ్యం కాదని ప్రజలకు ఎంత సేవ చేసి దగ్గరయ్యామా అన్నది ముఖ్యమని చెప్పి ఎంతో విలువైన సలహాలను ఇచ్చారని అన్నారు. అంతేకాక తన ఉత్సాహన్ని చూసి రాజకీయాల్లో తప్పక రాణిస్తావని ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయామని ఈ లోటు తనకు వ్యక్తిగతంగా తీర్చలేని అన్నారు.

## ఓ దిగ్గజాని కోల్పోయిన తెలుగు జాతి

- రామోజీ రావుకు నివాళ్ళు అర్పించిన టిడిపి నాయకులు

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మీడియా, వినోద రంగం, తెలుగు జాతి ప్రజలు ఓ దిగ్గజాన్ని కోల్పోయిన దని మండల టిడిపి అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాస రావు అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీను అధ్యక్షతన మండల టిడిపి కార్యాలయంలో రామోజీ రావు మృతికి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సోమే పల్లి శ్రీను మాట్లాడుతూ భారత మీడియా, వినోద రంగం, వ్యాపార వేత్త, ఈనాడు పత్రిక, ఈటివి నెట్ వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ తో సహ అనేక సంస్థల కు ఆయన మార్గ దర్శకుడు, పద్మ విభూషణ్ రామోజీ రావు అని అన్నారు. రామోజీ రావు చిత్ర పటానికి దర్శి నియోజకవర్గం రైతు అధ్యక్షులు మేదరమెట్ల వెంకట రావు, మండల టిడిపి నాయకులు బీజ్జం సుబ్బారెడ్డి, మాజీ జడ్.పి.టి.సి నాగ రాజు, మాజీ సర్పంచ్ నిడమానూరి శ్రీను, వీరపనేని చంద్రమౌళి, రాగిపిండి నాగేశ్వర రెడ్డి, తదితరులు రామోజీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



## రామోజీరావుకు నివాళులర్పించిన టిడిపి నాయకులు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అనారోగ్యంతో స్వర్గస్తులైన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. పత్రికా రంగంలో ఆయన సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## అక్షర ధీరుడు రామోజీరావు మృతి పట్ల ఎంపీపీ తాటికొండ ఘన నివాళి

తాళ్లూరు, మేజర్‌న్యూస్: మండలంలోని తెలుగు దేశంపార్టీ కార్యాలయంలో రామోజీరావుకి చిత్రపటానికి ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఘన నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఈనాడు, ఈటివి, మార్గదర్శి, ఉషాకిరణ్ మూవీస్ మరియు రామోజీ ఫిలిం సిటీ అధినేత, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత, చెరుకూరి రామోజీ రావు మరణ వార్త నాకు ఎంతో బాధ కలిగించిందన్నారు. మండలపార్టీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ రామోజీరావు ముఖ్యంగా సినీ, వ్యాపార, మీడియా రంగంలో ప్రముఖ పాత్ర పోషించి లక్షలాది మందికి ఉపాది కల్పించారుని అన్నారు. పార్ల మెంట్ కార్య వర్గ సభ్యులు శాగం కొండారెడ్డి, మనం రమేష్ బాబు మాట్లాడుతూ, మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనం. ఆయన లేని లోటు ముఖ్యంగా పత్రికా రంగానికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐ.శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, గోపి రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, వలి, హనుమా రెడ్డి తదతరులు పాల్గొన్నారు.





## విలువలకు విశ్వసనీయతకు మారుపేరు రామోజీరావు

అద్దంకి, మేజర్ న్యూస్: విలువలకు విశ్వసనీయతకు మారుపేరు రామోజీరావు అని రోటరీ సభ్యులు పలువురు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రోటరీ సభ్యులు మాట్లాడుతూ రామోజీరావు సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వశక్తితో విలువలు,విశ్వసనీయతలతో తను అడుగుపెట్టిన అన్ని రంగాలలో,పత్రికా రంగంలో, వ్యాపార రంగంలో, సినీ రంగంలో, టివి రంగంలో, చిట్స్, ఫైనాన్స్ రంగంలో అసామాన్య స్థితికి చేరుకొని, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి కల్పించిన మహాను భావుడని, తెలుగుజాతికి ఒక ఆదర్శప్రాయుడని అన్నారు. భారత ప్రభుత్వం కూడా పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేసినదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, దేవపాలన, దివాకర్ దత్తు, మలాది శ్రీనివాసరావు షేక్ మొహమ్మద్ రఫీ, ,సందిరెడ్డి శ్రీనివాసరావు,దివాకర్ దత్తు,పసుపులేటి ఆంజనేయులు, ఊటుకూరు రామకోటేశ్వరావు, పూర్ణ చంద్రరావు,మన్నం త్రిమూర్తులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి కంచర్ల కోటయ్య గౌడ్ రాజీనామా



గిద్దలూరు, మేజర్‌న్యూస్: రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి కంచర్ల కోటయ్య గౌడ్ రాజీనామాను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సిఎస్ నీరబ్ కుమార్ ప్రధాన కార్యదర్శి అమరావతికి తన రాజీనామా లేఖను పంపించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సిఎస్ నీరబ్ కుమార్ ఉత్తర్వుల మేరకు కార్పొరేషన్ చైర్మన్స్, డైరెక్టర్స్, బోర్డు మెంబర్స్ అందరిని రాజీనామాలు చేయవలసిందిగా తెలియజేయడం వలన తన పదవికి రాజీనామా చేసినట్లుగా ఒక ప్రకటనలో తెలియచేశారు.

## నేతాజీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు

చీరాల, మేజర్ న్యూస్: నేతాజి సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నేతాజి సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు చుండూరి కృష్ణమూర్తి మరియు పవని భానుచంద్రమూర్తి మాస్టారులు అన్నారు. స్థానిక



పేరాల చిన్న రథం సెంటర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద శనివారం పేదలకు అల్పాహార పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహించారు. ముందుగా నేతాజి సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కెఈ విద్యాసాగర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామారావు, మణిబాబు, రవికుమార్, చంద్రమౌళి, కొత్త వెంకటేశ్వరరావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ విజేతలకు ఘన సన్మానం

చీరాల రూరల్, మేజర్ న్యూస్: బీరం వెంకట సుబ్బయ్య-పున్నమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నీట్‌లో విజేతలైన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. స్థానిక సదానందరావు రెసిడెన్సీలో శనివారం నీట్ విజేతలైన జి



పాల్ స్టీఫెన్(616), అమృతా నంద్(468)లను ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ బీరం సుందరరావు సన్మానించారు. ఈ సందర్భంగా విజేతలకు బీరం సుందరరావు పుష్ప గుచ్ఛాలు అందజేసి, పూలమాల వేసి, దుశ్శాలవాలతో ఘనంగా సన్మానించి, నగదు పారితోషకం అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో జి కిరణ్‌బాబు, దయామణి, శరత్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యకు చిరునామ ప్రభుత్వ పాఠశాలలు : విజయలక్ష్మి



కనిగిరి, మేజర్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తు వారి బంగారు భవిష్యతు పునాదులు వేస్తున్నాయని, జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయ లక్ష్మి పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఆమె పాఠశాల పరివాహక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా ర్థులకు అమ్మఒడి పథకం ద్వారాఏటా రూ.15 వేలు తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేస్తుందని అన్నారు. అలాగే విద్యార్థులు అవసరమైన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యునిఫాం, బ్యాగులు, షు వంటి అన్ని రకాల ఏర్పాట్లు విద్యార్థుల కోసం చేస్తుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తు విద్యార్థుల భవిష్యత్‌కు మెరుగైన పునాదులు వేయటంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర ఎనలేనిదని ఆమె అన్నారు. విద్యార్థులకు వారంతపు పరిక్షలు, యునిట్ టెస్టులు, ప్రాజెక్టు వర్క్సులు, ప్రయోగశాల విద్యను అందిస్తు కార్పోరేట్ విద్యను ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులు ఎక్కువగా ఆదరిస్తున్నారని తెలిపారు. శనివారం పాఠశాల పరిధిలోని కాశిరెడ్డి కాలనీ, దేవాంగనగర్, టకారిపాలెం ప్రాంతంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేరాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి.రమణారెడ్డి, రంగారెడ్డి, సత్యగోపాల్, కాశిం, ఫిజికల్ డైరెక్టర్ పాశం సుశీల, రమాదేవి తదితరులు ఉన్నారు.

## పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

### - పేదలకు అన్నదానం





వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని జాండ్రపేట శివాలయ కళ్యాణ మండపంలో యూకే ఎన్నారైలు బట్ట రవివర్మ, బట్ట రుద్రవర్మ ఆధ్వర్యంలో శనివారం జనసేనాని పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాసిక వీరభద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు జనసేనని పవన్ కళ్యాణ్ చేసిన కృషి అమోఘం అద్వితీయమని అన్నారు. పవన్ కళ్యాణ్ ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తిని అన్నారు. చీరాలలో చేనేతలు అధికంగా ఉన్నారని, వారి సమస్యల సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. వేటపాలెం మండల జనసేన పార్టీఅధ్యక్షుడు ఉగ్గిరాల మార్కండేయులు మాట్లాడుతూ ప్రధాని మోడీజీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు త్రిమూర్తులుగా వ్యవహరించి రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించేందుకు కృషి చేశారని తెలిపారు. సీనియర్ టిడిపి నాయకులు సిద్ధి వెంకట బుచ్చేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ మాట తప్పని మడమతిప్పని వ్యక్తిని కొనియాడారు. సమస్యల పోరాటంలో ఆయనకాయనే సాధ్యమని వివరించారు. చేనేత సమస్యల సాధన కోసం కృషి చేసి కొంతమేరకు విజయం సాధించారని అన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం 200 పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బట్ట మోహన్ రావు వేటపాలెం రోటరీ క్లబ్ ప్రసిడెంట్, పుష్పవల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన వీర సైనికులు బుద్ధి శ్రీహర్ష, మామిడాల శ్రీనివాసరావు, అనుమాల శెట్టి కిషోర్, వేటపాలెం పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, జ్యోతిర్మయి దేవాంగ సంఘం అధ్యక్షుడు గౌరబతుని రవిబాబు, బాపట్ల జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మా రాహుల్ జి, ఉపాధ్యాయులు పింజల శ్రీనివాసరావు, గుత్తిపరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి రామోజీరావు

### రామోజీరావుకు నివాళులర్పించిన తెదేపా నేతలు

అద్దంకి, మేజర్ న్యూస్: తెలుగు జాతి గర్వించదగిన వ్యక్తి గా రామోజీరావు చిరస్మరణీయుడని పలువురు తెదేపా నేతలు అన్నారు. పట్టణంలోని పోతురాజు గండి వద్ద గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సంతాప సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ



భరతజాతికి ఎన్నోరకాలుగా సేవలు అందించిన దివంగత చెరుకూరి రామోజీరావు భారతరత్న అవార్డుకు అర్హులని అన్నారు. కాంగ్రెస్ భావాలకు వ్యతిరేకంగా తెదేపా ఆవిర్భాంలో దివంగత అన్న ఎన్టీఆర్ కు అనేక సలహాలు ఇస్తూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో పాలుపంచుకున్నారన్నారు. రామోజీరావు లేని టోటు పూడ్చలేనిదన్నారు. అచ్చతెలుగు నుడికారానికి నిలువెత్తు నిదర్శనం రామోజీరావు అని, ప్రపంచదేశాలకు తెలుగువారి పచ్చళ్లు రుచి చూపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సంధి రెడ్డి శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, పెంట్యాల రామాంజనేయులు, రాజశేఖర్, దొప్పలపూడి దుర్గాప్రసాద్, రామాంజనేయులు, రాజేష్, వేణు, భరత్, హరీష్ తదితరులు ఉన్నారు.

## దామచర్ల ను కలిసిన అనిల్,గౌస్

పొదిలి మేజర్ న్యూస్: సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆయన నివాసంలో శనివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ ( పండు) మరియు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి గౌస్ బాషా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆనందం వ్యక్తం చేశారు ఆయన మాట్లాడుతూ జిల్లా మంత్రిగా చూడాలని అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నామని మా నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అఖండ మెజార్టీతో గెలిచిన సందర్భంగా సంబరాలు





చేస్తున్నామని తెలిపారు అలాగనే మీరు జిల్లా మంత్రిగా వస్తే ఇంకా మా సమస్యలు పూర్తిగా తెలియజేస్తామని ఒంగోలు అభివృద్ధికి అంత పాల్పడ్డారో మన మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధి కూడా అంతే పాటుపడతారని చెప్పి మార్కాపురం కూడా జిల్లా చేయాలని ఉద్దేశంతో కలవడం జరిగింది అని తెలిపారు తప్పకుండా ఏ సమస్యలున్న నా దగ్గరికి తీసుకురండి నీ పరీక్షిస్తారని హామీ ఇచ్చారు. దామచర్ల జనార్ధన్ ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రామోజీరావు అక్షర యోధుడు
## - ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మేజర్ న్యూస్ : ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావుకు కందుకూరు తెలుగుదేశం పార్టీ ఘన నివాళులు అర్పించింది. కందుకూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈనాడు పత్రిక, చానల్స్ ద్వారా కోట్లమందిలో చైతన్యాన్ని నింపి



స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఇంటూరి నాగేశ్వరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పేదలను, బాధితులను ఆదుకోవడంలో రామోజీరావు ముందు నిలిచారని, తెలుగు భాషను పరిరక్షించడంలో ఎనలేని సేవ చేశారని అన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షుడు నార్నే రోశయ్య, ఇంకా పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఇంటూరి అభిమానుల పాదయాత్ర

కందుకూరు, మేజర్ న్యూస్ : సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్న సందర్భంగా అలాగే కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గా ఇంటూరి నాగేశ్వరరావు భారీ మెజారిటీతో గెలిచినందుకు ఇంటూరి నాగేశ్వరావు అభిమానులు మొక్కు తీర్చుకునేందుకు కందుకూరు అంకమ్మ తల్లి ఆలయం నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు.



ఈ పాదయాత్ర లో అబ్బూరి వేణు, అబ్బూరి చందు, మధిర బ్రహ్మరూప్, పత్తిపాటి పవన్, మద్దెల సాయి, వేములూరి సాయి, వేములూరి బ్రహ్మం, ఇంకా పలువురు పాల్గొంటున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పలువురు నాయకులు వీరికి సంఘీభావం తెలిపారు.

# కెఎస్ఆర్ సేవలు స్ఫూర్తిదాయకం

ఇంకొల్లు(పూసపాడు), మేజర్ న్యూస్: విద్యలో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించే విషయంలో కొమ్మాలపాటి శ్రీనివాసరావు(కె ఎస్ఆర్) సేవలు పలువురికి స్ఫూర్తిదాయకం కావాలని కెఎస్ఆర్ మిత్ర బృందం ఆకాంక్షించారు. పూసపాడు గ్రామంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ప్రముఖ వ్యాపారవేత్త అయిన సామాజిక సేవా రత్న మరియు ఆంధ్ర రత్న అవార్డు గ్రహీల కొమ్మాలపాటి శ్రీనివాసరావు ఆయన మిత్ర బృందం ఆర్థిక సాయంతో సమకూర్చిన ల్యాబ్ ట్యాప్‌ను



అదే గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ చదువుతున్న మద్దుకూరి సాయికిరణ్ అనే విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని, కష్టపడి చదివితే సరస్వతీ దేవి కటాక్షం దక్కుతుందని సూచించారు. ఈ కార్యక్రమం పెద్ది సాంబశివరావు, మోపర్తి సాంబశివరావు, జాస్తి చంద్రశేఖర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మద్దినేని సుధాకర్, పొట్టిముర్తి సహదేవ్, వై రమణబాబు, బోడావుల బలరాం, కొమ్మాలపాటి సుభాష్, ఘంటా బాబు, యార్లగడ్డ రామకృష్ణ, కరణం పూర్ణ బ్రదర్స్, పిడికిటి శ్రీనివాస్, కరణం రమేష్, మండవ సహదేవరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు బస్సు దగ్ధం

ఉలవపాడు, మేజర్‌న్యూస్: ఓ ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైన సంఘటన చాగొల్లు సమీపంలోని16వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు చెన్నై నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న శ్రీ తులసి ప్రైవేట్ బస్సు మండలంలోని చాగొల్లు సమీపంలో బస్సు ముందు భాగం నుంచి పొగలు రావడం గమనించిన బస్సు డ్రైవర్, క్లీనరు అలర్టై చాకచక్యంగా బస్సును ఆపి



ముందు డోర్ రాకపోవడంతో వెనక డోర్ ఓపెన్ చేసి ప్రయాణికులను సురక్షితంగా బయటకు చేరవేశారు. ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.టంగుటూరు నుంచి అగ్నిమాపక అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పినారు. స్థానిక ఏ.ఎస్.ఐ ఖాదర్ వలీ ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఆస్తి కోసం తొమ్మిదేళ్ల చిన్నారి దారుణ హత్య

కంభం, మేజర్‌న్యూస్: పెంచిన తల్లితండ్రులే బాలిక పాలిట యముడిగా మారారు. ముక్కుపచ్చలారని బాలికను కర్కష్యంగా చాకుతో గొంతు కోసి మరి హతమార్చారు. ఆస్తికోసం పెంచిన ప్రేమను మరిచిపోయి క్రూరంగా ప్రవర్తించారు. బాలిక పాలిట నరరూప రాక్షసులుగా మారి చిదివేశారు. అనంతరం ఏమి ఎరగన్నట్టు చిన్నారి మృతదేహం పక్కనే కూర్చొని ఏడుస్తున్నట్టు నటించారు. చివరకు పోలీసులకు చిక్కారు. ప్రకాశం జిల్లా అర్ధవీడులో ఈ దారుణం చోటుచేసుకుంది. ఆస్తికోసం 9 సంవత్సరాల శాన్వి రెడ్డిని పెంచిన తల్లితండ్రులే చాకుతో గొంతు కోసి హతమార్చారు. మొదట హత్యకు పాల్పడి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు బాలికను పెంచిన తల్లిదండ్రులు ప్రయత్నించారు. వృత్తిరీత్య ఉపాధ్యాయుడు అయినటువంటి పుచ్చకాయల వెంకట రమణారెడ్డి, పద్మావతి దంపతులకు పిల్లలు లేకపోవడంతో తన తమ్ముడి కూతురిని దత్తత తీసుకొని పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలిక పేరిట ఆస్తి మొత్తం రాశారు.






జేజి నాయన కూడా ఆస్తిని బాలిక పేరున వీలునామా రాశాడు. బాలిక ప్రస్తుతం అర్ధవీడులోని ఆదిత్య స్కూల్లో మూడవ తరగతి చదువుతుంది. ఇటీవల ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ లో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు పుచ్చకాయల వెంకట రమణారెడ్డి అతని భార్యతో కలిసి తన సొంత తల్లిదండ్రుల వద్దకు బాలిక శాన్వి రెడ్డి వెళ్ళింది. పెంచిన తల్లి తనను సరిగా చూసుకోవటం లేదని బాలిక ఆవేదన వ్యక్తం చేస్తూ తన సొంత తల్లిదండ్రులకు చెప్పింది. అంతేకాకుండా తను ఇంటికి రానని తన తల్లిదండ్రుల వద్ద ఉంటానని మారం చేసింది. బాలికకు నచ్చచెప్పి ఏదో విధంగా వెంకట రమణారెడ్డి అతని భార్య పద్మావతి తిరిగి బాలికను ఇంటికి తీసుకువచ్చారు. బాలిక తమ వద్ద ఉండేందుకు ఇష్టపడకపోవడం ఆస్తి మొత్తం బాలిక పేరున ఉండడంతో ఏమి చేయాలో వెంకట రమణారెడ్డి, పద్మావతి దంపతులకు అర్థం కాలేదు. అంతేకాకుండా ఇటీవల కొంత పొలాన్ని అమ్మేందుకు వెంకట రమణారెడ్డి ప్రయత్నించాడు. అందుకు శాన్వి రెడ్డి సొంత తల్లిదండ్రులు ససేమీరా అన్నారు. దీంతో రమణారెడ్డి భార్య కు రమణారెడ్డికి తీవ్ర ఆగ్రహం కలిగించింది. బాలిక బతికి ఉంటే తమ ఆస్తి తాము అనుభవించలేమని బాలికను హతమార్చేందుకు రమణారెడ్డి, పద్మావతి సిద్ధమయ్యారు. బాలిక ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న సమయంలో పద్మావతి బాలిక మొహం పై దిండు పెట్టి అరవకుండా చాకుతో గొంతు కోసి హతమార్చింది. తర్వాత వెంకట రమణారెడ్డి ఏమి ఎరగనట్లుగా పొలం పనులకు వెళ్లిపోయాడు. తర్వాత పద్మావతి బాలికను ఎవరో బయట నుంచి ఇంటిలోకి వచ్చి గొంతు కోసి హత్య చేసినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. సమాచారాన్ని అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. డిఎస్పీ బాలసుందర రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తర్వాత పెంచిన తల్లిదండ్రులను ప్రశ్నించగా తమకేమీ తెలియనట్లుగా బుఖాయించారు. పోలీసులు తమదైన రీతిలో ప్రశ్నించడంతో అసలు విషయం బయటకు వచ్చింది. బాలిక హత్యకు గురైన తీరును ఇన్వెస్టిగేషన్ చేసి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలోకి దించారు. విచారణలో నివ్వరపోయే నిజాలు పోలీసులు తెలుసుకున్నారు. పెంచిన తల్లితండ్రులే ఆస్తికోసం బాలికను హతమార్చారని పోలీసులు నిర్ధారించారు. రమణారెడ్డిని అతని భార్య పద్మావతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆస్తి కోసం పెంచిన ప్రేమను మర్చిపోయి ముక్కుపచ్చలారని బాలికను చిదిమేసిన రమణారెడ్డిని అతని భార్య పద్మావతి కటకటాల పాలయ్యారు. మార్కాపురం డిఎస్పీ బాలసుందర కంభం సర్కిల్ పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ మీడియా సమావేశంలో కంభం సీఐ రామకోటయ్య, కంభం ఎస్సై పులి రాజేష్, బేస్తవారిపేట ఎస్సై నరసింహారావు, అర్ధవీడు ఎస్సై అనిత పాల్గొన్నారు.

# నేడు ముండ్లమూరులో కంటి వైద్య శిబిరం

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రంలోని ముండ్లమూరులో ఉన్నం చార్టిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద కాకాని శంకర్ హాస్పిటల్ సౌజన్యంతో హై స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేసినట్లు ఉన్నం చార్టిబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఉన్నం నరసింహారావు, రామాంజినేయులు తెలిపారు. ఈ శిబిరంకు వచ్చే వారు తమ వెంట ఆధార్ గాని రేషన్ కార్డును వెంట తీసుకువచ్చు కోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంకు వచ్చే వారికి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# అభిమానాన్ని చాటుకున్న టిడిపి నాయకుడు

కంభం, మేజర్‌న్యూస్: నారా చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా గెలుపొందిన సందర్భంగా మరియు గిద్దలూరులో ముత్తుముల అశోక్ రెడ్డి గెలుపొందిన సందర్భంగా కంభం పట్టణంలోని తన ఇంటి నుండి రాచర్ల మండలంలోని శ్రీ రంగస్వామి సన్నిధికి పాదయాత్ర చేసిన వీరాభిమాని మొర్రిబోయినా మోహన్ రంగ (గాంధీ) తనతో పాటు, రవి యాదవ్, చరణ్, ముగ్గురు కూడ గాంధీతో పాటు పాదయాత్ర సాగిస్తున్నారు.



# అచ్చంనాయుడిని కలసిన టిడిపి నాయకులు

దర్శి, మేజర్‌న్యూస్: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చం నాయిడిని టిడిపి నాయకులు కలిశారు. మంగళగిరిలోని రాష్ట్ర టిడిపి కార్యాలయంలో అచ్చం నాయుడుని దర్శి టిడిపి నాయకులు కలిశారు. టీడీపీ పార్టీ ఆఫీసులో, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు ఆచెన్నాయుడుని, టీడీపీ ప్రకాశం మాజీ లీగల్ సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టిడిపి అధ్యక్షులను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండాది వీరంజి, చంద్ర, వేంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఎం.ఎల్.సి తనయుడుని కలసిన గరికపాటి



దర్శి, మేజర్‌న్యూస్: ఎం.ఎల్.సి రామ్‌భూపాల్ రెడ్డి తనయుడిని దర్శి జనసేన నాయకులు గరికపాటి వెంకట్ కలిశారు. టిడిపి ఎం.ఎల్.సి రామ్ భూపాల్ రెడ్డి తనయుడు సాయిని దర్శి జనసేన ఇంఛార్జ్ గరికపాటి వెంకట్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సాయిని గరికపాటి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గరికపాటి వెంకట్ వెంట జనసేన నాయకులు పాల్గొన్నారు.

# పోలీసులు ప్రజా రక్షకులుగా ఉండాలి

చీరాల రూరల్, మేజర్ న్యూస్: ప్రజా రక్షకులుగా పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని శాసన సభ్యుడు ఎంఎం కొండయ్య సూచించారు. స్థానిక కొత్తపేట బైపాస్ పక్కన ఉన్న టిడిపి కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీసులు నూతనంగా శాసన సభ్యుడుగా ఎన్నికైన ఎంఎం కొండయ్యను మర్యాద పూర్వకంగా కలుసుకుని, పుష్ప గుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎం కొండయ్య మాట్లాడుతూ చీరాలలో ఎల్లప్పుడా ప్రశాంత వాతావరణం నెలకొని ఉండాలని,



సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలను మర్యాదగా పలకరించాలని సూచించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పోలీసులు ఎప్పుడూ ప్రజలకు పోలీసులు న్యాయం చేసే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. ఎంఎం కొండయ్యను కల్సిన వారిలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఒకటో పట్టణ సీఐ శేషగిరి రావు, రెండో పట్టణ సీఐ సోమశేఖర్, గ్రామీణ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, వేటపాలెం ఎస్సై సురేష్, ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ తదితరులు ఉన్నారు.

## రంగనాయక స్వామిని దర్శించుకున్న మాగుంట రాఘవరెడ్డి

రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయాన్ని



శనివారం టిడిపి నాయకులు మాగుంట రాఘవరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి అధికారంలోకి రావడంతో స్వామి వారికి మొక్కు చెల్లించేందుకు వచ్చినట్లుగా మాగుంట రాఘవరెడ్డి తెలిపారు. అర్చకులు అందించిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుప్పా రంగనాయకులు పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాగుంట రాఘవరెడ్డికి ఘన స్వాగతం

తాళ్లూరు, మేజర్‌న్యూస్: తాళ్లూరులోని మాజీ సర్పంచ్ రమణా రెడ్డి నివాసంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయులు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డికి



ఘన స్వాగతం పలికారు. సీనియర్ నాయకులు ఐడమకంటి వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శులు శాగం కొండారెడ్డి, మానం రమేష్ బాబు, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, సీనియర్ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి ఉప సర్పంచ్ యత్తపు కాశిరెడ్డి, రాయుడు, తాళ్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు మారం వెంకా రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ నాయకులు మేడగం వెంకటేశ్వర రెడ్డి, కైపు రామకోటి రెడ్డి, సమర, గోపిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సానె సురేష్, మీరా మోహిద్దీన్, పిన్నిక రమేష్, పాశం సూరిబాబు, యాతం శ్రీనివాసు రెడ్డి, పుట్ట నరసింహారావు, గూడ ప్రభాకర్ రెడ్డి, ఆర్.వెంకట్రావు, రావినూతల పరిశుద్ధ రావు, చాట్ల డాని, వేడికోల నరసింహారెడ్డి, కనికెట్టి రామ లక్ష్మయ్య, పుల్లారెడ్డి, అన్వర్, తూము లక్ష్మిరెడ్డి, పేరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాగుంటకు ఘన స్వాగతం



దర్శి, మేజర్‌న్యూస్: ఒంగోలు యంపి మాగుంట శ్రీనివాస్ రెడ్డి తనయుడు రాఘవ రెడ్డికి టిడిపి నాయకులు రెండో వార్డు కౌన్సిలర్ వి.సి.రెడ్డి ఘన స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి విజయ కేతనం ఎగురవేసింది. దర్శి పర్యటనకు వచ్చిన రాఘవ రెడ్డికి టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా దర్శికి వచ్చిన సందర్భంగా రాఘవ రెడ్డిని టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిశారు. అనంతరం రాఘవ రెడ్డిని విసి రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.



## ఎమ్మెల్యే స్వామికి చిలుకూరు పాడు టిడిపి నేతలు శుభాకాంక్షలు





జరుగుమల్లి, మేజర్‌న్యూస్: కొండెపి శాసనసభ్యులుగా మూడోసారిగా కొండెపి నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన శాసనసభ్యులు డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి మూడోసారిగా విజయం సాధించడంతో టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. అయితే కొండెపి నియోజకవర్గంలో జరుగుమల్లి మండలం గతంలో 1250 ఓట్లు టిడిపికి రాగా ఈసారి 5000 పైనే ఈ మండలం సాధించడం మండలంలో ప్రతి కార్యకర్తలు నాయకులు కష్టపడి పనిచేసే పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తిస్తుందని శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం జరుగుమల్లి మండలం చిలుకూరుపాడు గ్రామ టిడిపి సీనియర్ నాయకులు నలదల కృష్ణారావు, నలదల సుబ్బారావు, జీవీ వెంకటేశ్వర్లు, కొత్తపల్లి జాలయ్య, అరికట్ల రమణయ్య సమక్షంలో మూడవసారి ఈ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందిన స్వామికి పుష్పగుచ్చాలు ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం ప్రజలకు అది ఎంతో మేలు చేయగలడంతో అవి గమనించి ప్రజలు తెలుగుదేశం పార్టీ ఓట్లు వేసి మళ్లీ సీఎం చంద్రబాబు నాయుడుని చేయాలని ప్రజల లక్ష్యంతో పని చేసినట్లు ఎమ్మెల్యే స్వామి తెలిపారు.

## నకిలీ విత్తనాల వ్యాపారంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

**- యంపిజె రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్**

మార్కాపురం, మేజర్‌న్యూస్: దేశంలో, రాష్ట్రంలో నకిలీ విత్తనాల వ్యాపారస్తులు రైతుల అమాయకత్వాన్ని



ఆసరాగా చేసుకుని మోసం చేయడం ఎక్కువగా తయారైంది. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి చేతికి పంట రాకపోగా, పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ లో రైతులు పంటలు వెయ్యడానికి సిద్ధమైతున్న తరుణంలో మార్కెట్ లో నకిలీ విత్తనాలు రావడం ఎక్కువయ్యాయి. కొన్నింటిని అధికారులు పట్టుకుంటున్న, కొంతమంది వ్యాపారస్తులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్ముతున్నారు. దీంతో పంట చేతికి రాకపోవడంతో ఆర్థికంగా దివాళా తీసి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు ముందు జాగ్రత్తగా నకిలీ విత్తనాల వ్యాపారస్తులపై భరతం పట్టాలని యంపిజె రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. అలాగే నకిలీ విత్తనాల వల్ల ఆర్థికంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే జవాబుదారిగా ఉండి వారికి పూర్తి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, ఇలాంటి వ్యాపారస్తుల షాపుల పర్మిషన్ రద్దు చేసి వారిని కఠినంగా శిక్షించాలని యంపిజె కోరుతుంది.

## పొదిలి అమ్మ గుడిలో ప్రత్యేక పూజలు పాల్గొన్న కందుల వసంత లక్ష్మి, వై లక్ష్మి

పొదిలి, మేజర్ న్యూస్: మార్కాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా కందుల నారాయణరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా పొదిలి అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి, సోదరి వై లక్ష్మి ప్రత్యేక పూజలు చేసి తెలుగుదేశం పార్టీ మహిళా నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మార్కాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తామని



మహిళలకు అండగా ఉంటామని ప్రతి ఒక్కరి సమస్య పరిష్కరిస్తామని ప్రత్యేక పూజలు చేసి కందుల నారాయణరెడ్డి గెలుపు కోసం కృషి పడ్డ వాళ్లందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపినట్టు తెలియజేసిన భార్య వసంత లక్ష్మి , చెల్లెలు వై లక్ష్మి మండలంలో ఉన్న టిడిపి నాయకులు, మహిళా నాయకురాలకు మొత్తానికి శుభాకాంక్షలు తెలిపిన ఇరువురు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కాటూరి పెద్దబాబు, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దుస్, మండల కన్వీనర్ మీగడ ఓబుల్ రెడ్డి మాజీ సర్పంచులు కాటూరి మాధురి, స్వర్ణ గీత, కాటూరి చినబాబు, బెల్లంకొండ విద్యాసంస్థల కరస్పాండెంట్ విజయలక్ష్మి, పట్టణ మహిళా ఆర్యవైశ్య నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, బొడ్డు సుబ్బయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్ కోసం రంజిత్ కుమార్ ఆర్థిక సాయం

మార్కాపురం, మేజర్‌న్యూస్: మార్కాపురంకి చెందిన రంజిత్ కుమార్ ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్ కోసం యువ కేర్ వెల్ఫేర్ సొసైటీ వారిని ఆర్థిక సహాయం కోరగా యువ కేర్ తరపున కొంత డబ్బు సేకరించి ఈ కుటుంబానికి అందించాలని భావించి దాతల ద్వారా 22 వేల రూపాయలను సేకరించి



అందించటం జరిగింది. కార్యక్రమంలో యువ కేర్ అధ్యక్షుడు ఆరీపుద్దిన్, సలహాదారులు జైనులాబ్దిన్, గుల్జార్ బాషా, నిజాముద్దీన్, సభ్యులు కరీముల్లా, జాకీర్లు పాల్గొని రంజిత్ కుమార్ కు 22 వేల రూపాయల చెక్కును అందించారు. సహాయం పొందిన రంజిత్ కుమార్ కుటుంబ సభ్యులు యువ కేర్ సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు ఆరీఫ్ మాట్లాడుతూ రంజిత్ ఆపరేషన్ కోసం ఇంకా ఎంతో డబ్బు అవసరం ఉందని, సహాయం చేయాలని ఉన్న వారు యువ కేర్ సంస్థ వారి 7386642536ని సంప్రదించాలని లేదా పేషెంట్ రంజిత్ కుమార్ నంబర్ 9885010704కి ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా పంపగలరని తెలిపారు.

## ఆటో తిరగబడి వృద్ధుడు మృతి

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వెలుగుల గ్రామానికి చెందిన ఆటో మండల పరిధిలోని కంద్రిక గ్రామానికి దిశకర్మకు వెళ్లి



వస్తుండగా నాగులారం రాళ్లపల్లి మధ్యలో ఆటో తిరగబడటంతో ఎరుగుపల్లి గ్రామానికి చెందిన కత్తి పౌల్ 70 సంవత్సరాలు చనిపోయాడు. అందులో ఉన్న ఏడు మంది గాయాలు కాగా వారిని కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. ఆటో తిరగబడతానే ఆటో డ్రైవర్ పరారయ్యాడు. ఈ మేర వెలిగండ్ల ఎస్సై శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

## మానవతా సేవ సంస్థకు 5000 చెక్ అందించిన భవాని గ్రూప్స్ అధినేత

పొదిలి మేజర్ న్యూస్: ప్రముఖ వ్యాపారస్తులు భవాని గ్రూప్స్ అధినేత శ్రీ పేర్ల శ్రీనివాసరావు పొదిలి లోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు



ఆకర్షితులై సంస్థ చైర్మెన్ ముప్పవ్వల పార్థసారథికి 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఈ రోజు అందించారు.పొదిలి లో మానవత సంస్థ ఏర్పడిన తరువాత నిరుపేదలకు చేయూత నిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారని భవిష్యత్ లో ఇంకా మంచి కార్యక్రమాలు చేయాలని తనవంతు గా ఈ ఆర్థిక సహాయం చేసినట్లు పేర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పొదిలి మానవత సంస్థ వారికి అభినందలు తెలియచేసింది.

# ఎకానమీ

## APPSC, TSPSC
## గ్రూప్-1, 2, జె.ఎల్., డి.ఎల్., నెట్, స్లెట్



# ద్రవ్యోల్బణం (INFLATION)

మానవుని సగటు జీవితకాలంలో మరియు నిరంతర ఆర్ధిక కార్యకలాపాలలో ద్రవ్యోల్బణము చాలా కీలకపాత్ర వహిస్తున్నది.

**ద్రవ్యోల్బణం :**

- ధరల స్థాయి పెరుగుతూ ద్రవ్యం కొనుగోలు శక్తి తగ్గుటను ద్రవ్యోల్బణం అంటారు.
  Inflation as "A state in which the value of money is falling, that is prices are increasing".
- హాట్రే నిర్వచనం ప్రకారం అధిక కరెన్సీ నోట్లను జారీ చేయుటను ద్రవ్యోల్బణం అంటారు.
- **డాల్టన్ కౌల్ బర్నే** ప్రకారం తక్కువ వస్తురాశిని ఎక్కువ ద్రవ్యం తరమడమే ద్రవ్యోల్బణం.
  "Too much money chasing too few goods"
- **క్రౌథర్** ప్రకారం.... ధరల స్థాయి పెరుగుదల అనగా ద్రవ్యం విలువ తగ్గటమే ద్రవ్యోల్బణం.
- **షాపిరో** ప్రకారం......నిలకడగాను, నిరంతరంగాను ధరల స్థాయిలో వచ్చే పెరుగుదల ద్రవ్యోల్బణం.

**ఆమోదించబడిన ద్రవ్యోల్బణ రేటు** (Healthy Range of Inflation) :

- భారతదేశంలో 1973లో అంతర్జాతీయ స్థాయిలో ఆయిల్ ధరలు పెరగడం వలన ద్రవ్యోల్బణం పెరిగింది. మళ్ళీ 1975 సంవత్సరంలో ద్రవ్యోల్బణం తగ్గినది. అప్పటినుండి ఆర్‌బిఐ ద్రవ్యోల్బణం తగ్గించుటకు ద్రవ్యపరమైన చర్యలు చేపట్టినది. భారత దేశంలో ద్రవ్యోల్బణం లక్ష్యాలకు సంబంధించి భిన్న అభిప్రాయాలు ఉన్నాయి.

**సి. రంగరాజన్ కమిటీ ప్రకారం**

- ద్రవ్యోల్బణం ప్రారంభంలో 6-7% తరువాత 5-6% మధ్య ఉండాలి.
- భారతప్రభుత్వం ప్రకారం 4-6% మధ్య ద్రవ్యోల్బణం ఆమోదయోగ్యమైనది.
- చక్రవర్తి కమిటీ ప్రకారం 4% ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థకు ఆమోదయోగ్యమైనది.
- తారాపూర్ కమిటీ ప్రకారం ఆమోదించదగిన ద్రవ్యోల్బణం 3-5% మధ్యలో ఉండాలని తీర్మానించారు.

**ద్రవ్యోల్బణం-రకాలు :**

**ప్రాకే ద్రవ్యోల్బణం :**

- ప్రతి సంవత్సరం ధరల స్థాయిలో పెరుగుదల చాలా తక్కువగా ఉంటే దానిని ప్రాకే ద్రవ్యోల్బణం అంటారు. ద్రవ్యోల్బణ రేటు సంవత్సరానికి 3% కంటే తక్కువగా ఉండును.

**నడిచే ద్రవ్యోల్బణం :**

- ప్రతి సం. 4% నుండి 5% వరకు ధరలు పెరుగుతుంటే దానిని నడిచే ద్రవ్యోల్బణం అంటారు.

**పరుగెత్తే ద్రవ్యోల్బణం:**

- సంవత్సరంలో ధరలు పెరుగుదల 10% ఉంటే దానిని పరుగెత్తే ద్రవ్యోల్బణం అంటారు.

**హైపర్ ద్రవ్యోల్బణం :**

- ద్రవ్యోల్బణం రేటు సంవత్సరానికి 3 అంకెల స్థాయిని చేరితే దానిని హైపర్ ద్రవ్యోల్బణం అంటారు.

**ద్రవ్యం, ద్రవ్య ప్రసార వేగము, ద్రవ్యోల్బణం రకాలు :**

**ద్రవ్య ద్రవ్యోల్బణం :**

- ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సప్లయి పెరగటం వలన డిమాండ్ పెరిగి ధరలు పెరిగితే దానిని ద్రవ్య ద్రవ్యోల్బణం అంటారు.

**ధరల ద్రవ్యోల్బణం :**

- ఆర్థిక వ్యవస్థలో ధరలు పెరిగినపుడు, ధరలు ఇంకా పెరుగుతాయని భయపడి ప్రజలు వచ్చిన డబ్బుని వచ్చినట్లే ఖర్చు పెట్టుట వలన ద్రవ్యప్రసారవేగం పెరుగును. ప్రసార వేగం పెరగడం వలన మరలా ధరలు పెరిగితే దానిని ధరల ద్రవ్యోల్బణం అంటారు.

**కీన్స్ వర్గీకరణ ప్రకారం ద్రవ్యోల్బణ రకాలు :**

**పాక్షిక ద్రవ్యోల్బణం:**

- ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని చేరడానికి ముందు కొన్ని ఉత్పత్తి కారకాల కొరత వలన ఉత్పత్తి వ్యయం పెరిగి ధరలు పెరిగితే దానిని పాక్షిక ద్రవ్యోల్బణం లేదా Semi Inflation అంటారు.

**వాస్తవిక ద్రవ్యోల్బణం :**

- ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ ఉద్యోగితా స్థాయిని చేరిన తరువాత సమిష్టి డిమాండు పెరిగితే ఉత్పత్తి తగ్గి ధరలు పెరుగును. దీనిని వాస్తవిక లేక నిజద్రవ్యోల్బణం అంటారు.

**ధరల నియంత్రణా స్థాయిని బట్టి ద్రవ్యోల్బణం వర్గీకరణ :**

**బహిరంగ ద్రవ్యోల్బణం :**

- ధరల పెరుగుదల నియంత్రణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వలన బహిర్గతంగా ధరలు పెరిగితే దానిని బహిరంగ ద్రవ్యోల్బణం అంటారు.

**అణచివేయబడిన ద్రవ్యోల్బణం :**

- రేషనింగ్, ధరల నియంత్రణ వంటి ప్రభుత్వ విధానాల వలన ధరల పెరుగుదల అణచివేయబడును. ప్రభుత్వం నియంత్రణ లను తొలగిస్తే ధరలు పెరుగును. దీనిని అణచివేయబడిన ద్రవ్యోల్బణం అంటారు.

**ద్రవ్యోల్బణ సిద్ధాంతాలలో ద్రవ్యోల్బణ రకాలు :**

**వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం :**

- ఉత్పత్తి వ్యయాలు పెరిగిన కారణంగా ధరల స్థాయి పెరిగితే దానిని వ్యయ ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు.

**లాభప్రేరిత ద్రవ్యోల్బణం :**

- లాభాలు పెరుగుట వలన ధరలు పెరిగితే దీనిని లాభప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు.

**డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం:**

- సమిష్టి సప్లయి కంటే సమిష్టి డిమాండు ఎక్కువగా ఉన్న కారణంగా ధరలు పెరిగితే దానిని డిమాండు ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు.
- దీనికి కారణాలు వినియోగ వ్యయం, పెట్టుబడి వ్యయం, ప్రభుత్వ వ్యయం పెరుగుదల కావచ్చు.

**వేతన ప్రేరిత ద్రవ్యోల్బణం :**

- వేతనాలు పెరుగుట వలన ధరలు పెరిగితే దీనిని వేతన ద్రవ్యోల్బణం అంటారు.

**రాబర్ట్ జె. గార్డన్ ప్రకారం** – ద్రవ్యోల్బణాన్ని మూడు రకాలుగా వివరించారు. దీనిని త్రికోణ నమూనా (Triangle Model) అంటారు.

Demana' Full Inflation :

- ప్రభుత్వ ప్రైవేట్ వ్యయాలు వల్ల సమిష్టి డిమాండ్‌లో కలిగే పెరుగుదల వలన ఏర్పడే ద్రవ్యోల్బణం.

Cast Push Inflation :

- ఉత్పత్తి కారకాల ధర పెరుగుదల వల్ల సమిష్టి సప్లయి తగ్గి ఏర్పడే ద్రవ్యోల్బణం.

Built-in Inflation :

- వేతనాలు పెరగాలనే కార్మికుల, ఉద్యోగుల ఆశలు ద్రవ్యోల్బణంకు ప్రేరణ కలిగిస్తాయి. దీనిని ధరల వేతన విస్ఫోటనం అంటారు.

Sectoral Inflation-రంగాల సంబంధిత ద్రవ్యోల్బణం :

- ఉత్పత్తి రంగంలోని ఒక తరహా పరిశ్రమలో తయారైన వస్తుసేవల ధరలు పెరగడాన్ని రంగాల సంబంధిత ద్రవ్యోల్బణం అంటారు.

**కోశసంబంధ ద్రవ్యోల్బణం :**

- ప్రభుత్వం సేకరించిన రాబడి కంటే ఎక్కువ వ్యయం చేయడం వల్ల ఏర్పడే ద్రవ్యోల్బణం.

**ధరశక్తి నిర్ణయ ద్రవ్యోల్బణం :**

- పారిశ్రామిక వ్యాపార సంస్థలు తమ లాభాలను పెంచుకోవటానికి వాటి ఉత్పత్తి అమ్మకపు ధరలు పెంచడాన్ని ధరశక్తి నిర్ణాయక ద్రవ్యోల్బణం అంటారు.

**ద్రవ్యోల్బణ విరామం :**

- J.M. కీన్స్ "How to pay for the war" అనే గ్రంథము నుండి దీనిని వివరించారు. ఆర్థిక వ్యయం మొత్తం ఉత్పత్తి విలువ కన్నా ఎక్కువగా ఉంటే వాటి మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యోల్బణ విరామం అంటారు.

**ఇతర కారణాలు :**

- సంపూర్ణ ఉద్యోగితాస్థాయి వద్ద గల జాతీయ ఆదాయ స్థాయి కంటే వినియోగం పెట్టుబడి కలిపి ఎక్కువ ఉంటే ద్రవ్యోల్బణ విరామం ఏర్పడును.
- ఇందులో ఉత్పత్తి కాబడిన వస్తుసేవల కంటే ప్రజల డిమాండు ఎక్కువగా ఉంటుంది.
- పొదుపును పెంచుట ద్వారా కానీ, ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుట ద్వారా ద్రవ్యోల్బణ విరామమును తగ్గించవచ్చు.
- దీర్ఘకాలంలో ఉత్పత్తి పెంచుట ద్వారా ద్రవ్యోల్బణ విరామమును తగ్గించవచ్చు.

**ప్రతిద్రవ్యోల్బణ విరామం:**

- సంపూర్ణ ఉద్యోగితా స్థాయివద్ద ఆదాయానికి ఉండవలసిన సమిష్టి డిమాండ్ కంటే వాస్తవంగా సమిష్టి డిమాండు తక్కువగా ఉంటే ప్రతిద్రవ్యోల్బణం ఏర్పడును.

**DISINFLATION :**

- ధరలు పెరుగుతున్నపుడు ప్రభుత్వం తీసుకొన్న చర్యల వలన ధరలు తగ్గితే దానిని Disinflation అంటారు.

Deflation :

- ధరలు తగ్గుచూ ఉండే పరిస్థితి లేదా ద్రవ్యం విలువ పెరుగుతూ ఉండే పరిస్థితిని డిఫ్లేషన్ అంటారు.

**క్రౌథర్ నిర్వచనం ప్రకారం :**

- వస్తుసేవల ధరలు తగ్గుట లేదా ధరల స్థాయి తగ్గుట అనగా ద్రవ్యం విలువ పెరుగుటయే ప్రతిద్రవ్యోల్బణం అంటారు.

**డిఫ్లేషన్ రావడానికి కారణాలు :**

- ప్రభుత్వం పెద్ద మొత్తములో ప్రత్యక్ష పన్ను విధించుట.
- దేశంలో పెద్ద మొత్తములో ప్రభుత్వం ద్రవ్యమును ఉపసంహరించుట.
- ప్రభుత్వం ప్రజల నుండి పెద్ద మొత్తములో స్వచ్ఛందంగా లేదా నిర్భందంగా ఋణాలను తీసుకొనుట.
- ఆర్.బి.ఐ. పెద్దమొత్తములో సెక్యూరిటీని అమ్ముట.
- బ్యాంకు రేటును పెంచుట, రేషనింగ్ విధించుట, సిఆర్‌ఆర్‌ని పెంచుట వంటి విపరీతమైన చర్యలు తీసుకొనుట.
- అధిక ఉత్పత్తి జరుగుట

**డిఫ్లేషన్ నివారణ చర్యలు :**

- పాత ఋణాలు ప్రభుత్వం తిరిగి చెల్లించుట.
- ప్రభుత్వ వ్యయాన్ని పెంచి ఉపాధి అవకాశాలను పెంచుట
- ద్రవ్య సప్లయిని పెంచుట
- వాణిజ్య బ్యాంకుల పరపతిని ఎక్కువగా పెంచుట
- పన్ను రేటును తగ్గించుట

**రిఫ్లేషన్ :**

- ఆర్థిక వ్యవస్థలో ప్రతి ద్రవ్యోల్బణం ఉన్నపుడు ప్రభుత్వం తీసుకున్న చర్యల వలన ధరలు స్థాయి పెరిగితే దానిని రిఫ్లేషన్ అంటారు.
- ఇన్‌ఫ్లేషన్‌లో ధరలు పెరుగుదల మార్కెట్ శక్తుల వలన జరిగితే, రిఫ్లేషన్‌లో ధరలు పెరుగుదల ప్రభుత్వ చర్యల వలన పెరుగును.
- డిఫ్లేషన్, డిసిన్‌ఫ్లేషన్‌లలో ధరలు తగ్గును.
- ఇన్‌ఫ్లేషన్ మరియు డిఫ్లేషన్‌లు రెండూ చెడ్డవే. కీన్స్ ప్రకారం ద్రవ్యోల్బణం అన్యాయం. ప్రతిద్రవ్యోల్బణం ఆచరణ యోగ్యం కాదు.

Stagflation :

- ద్రవ్యోల్బణ కాలంలో ఉద్యోగితారేటు పెరుగును. ధరల పెరుగుదలతో పాటు ఆర్థిక వృద్ధి జరుగును. ఒకవైపు ధరలు పెరుగుతూ మరోవైపు నిరుద్యోగిత కలిసి ఉంటే దానిని స్టాగ్‌ఫ్లేషన్ అంటారు.
- స్టాగ్ ఫ్లేషన్ మరియు ఇన్‌ఫ్లేషన్ రెండూ కలిసి ఉంటాయి.
- అందువలన దీనిని Inflationary Recession అంటారు.
- ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగిత అనేది అధిక ద్రవ్యోల్బణ రేటుతో కూడి ఉంటుంది.

**ద్రవ్యోల్బణం - కారణాలు :**

- డిమాండ్ పెరుగుదలను ప్రభావితం చేయు అంశాలు
- భారతదేశంలో ప్రభుత్వవ్యయం, లోటు పెరగటం వలన దానికి అనుగుణంగా సప్లయి పెరగకపోవడం వలన ధరలు పెరుగుతున్నాయి.



Dr.M.Reddi Ramu,
Associate Proffessor
Viswam Engineering
College, Angallu

# అక్షర శిల్పి రామోజీ కి ఘన నివాళి



చిన్న బావమరిది తాతినేని వెంకట కృష్ణారావు మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో డైరెక్టరుగా, తోడల్లుడు ముసునూరు అప్పారావు ఈనాడు, డాల్ఫిన్స్ హొటల్స్ మాజీ ఎండీగా కలసి పనిచేశారు.

బాపట్ల, మేజర్‌న్యూస్: చెరుకూరి రామోజీరావు ఈనాడు మార్గదర్శి గ్రూపు సంస్థల అధినేత. తెలుగు దినపత్రిక ఈనాడుకు వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు, ప్రచురణ కర్త. మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి వ్యాపార సంస్థల అధినేత. రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూపు ఆధీనంలో ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిల్మ్ సిటీ ఉంది. 2016 లో భారత ప్రభుత్వం అతనిని దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్ తో సత్కరించింది.

**కుటుంబ నేపథ్యం ఇదీ**

రామోజీరావు కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 1936 నవంబరు 16న రైతుకుటుంబంలో జన్మించారు. తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి వెంకట సుబ్బారావు. రామోజీరావు పూర్వీకులు పామర్రు మండలంలోని పెరిశేపల్లి గ్రామానికి చెందినవారు. అతని తాత రామయ్య కుటుంబంతో పెరిశేపల్లి నుంచి పెదపారుపూడికి వలస వచ్చాడు. రామోజీరావు తాత మరణించిన 13 రోజులకు జన్మించాడు. దానితో అతని జ్ఞాపకార్థం తల్లిదండ్రులు రామయ్య అన్న పేరు పెట్టారు. ఇతనికన్నా ముందు ఇద్దరు అక్కలు ఉన్నారు. పెద్దక్క పేరు రాజ్యలక్ష్మి, చిన్నక్క పేరు రంగనాయకమ్మ.

**బాల్యం, విద్యాభ్యాసం, వివాహం (1937 - 1961)**

ఇతని కుటుంబానిది శ్రీ వైష్ణవ నేపథ్యం. తల్లి చాలా భక్తిపరురాలు, ఆచారవంతురాలు కావడంతో చిన్నతనంలో ఇతనికీ భక్తి, శుచి అలవడింది. లేకలేక పుట్టిన మగసంతానం కావడంతో రామోజీని చాలా ముద్దుచేసేవారు. పెద్దక్క పెళ్ళిచేసుకుని వెళ్ళిపోయినా చిన్నక్క రంగనాయకమ్మతో సాన్నిహిత్యం ఉండేది. ఇంట్లో తల్లికి ఇంటిపనుల్లో, వంటలో సహాయం చేసే అలవాటూ ఉండేవి. రామయ్య అన్న తన పేరు నచ్చక ప్రాథమిక పాఠశాలలో చేరేప్పుడే స్వంతంగా "రామోజీ రావు" అన్న పేరును సృష్టించుకుని, తానే పెట్టుకున్నాడు. ఆ పేరే జీవితాంతమూ కొనసాగుతోంది. రామోజీరావు 1947లో గుడివాడలో పురపాలకోన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరాడు. 1957లో ఆరవ ఫారం అక్కడే పూర్తిచేసుకుని, గుడివాడ కళాశాలలో ఇంటర్, బీఎస్సీ చదివారు. 1961 ఆగస్టు 19న రామోజీరావుకు, పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండవ కుమార్తె రమాదేవితో వివాహం జరిగింది. రమాదేవి అసలు పేరు రమణమ్మ కాగా పెద్దలు పెట్టిన పేరు నచ్చక అలా మార్చుకుంది. రామోజీరావుతో భార్య వైపు బంధువుల్లో

## రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం: వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి బాధాకరం. బాపట్ల పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు బాపట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి స్వయంకృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావు. ఈనాడు దినపత్రిక స్థాపించి తెలుగు పత్రికా ప్రపంచంలో నవ శకానికి నాంది పలికారు. ఈనాడు మీడియా సంస్థ ద్వారా నిజాలను నిర్భయంగా ప్రసారం చేసి సమాజాన్ని చైతన్యం చేశారు. ఈనాడు ముందడుగు ద్వారా సామాన్యులకు చేరువగా సమాచార హక్కు చట్టం, సుజలాం, సుఫలాం అంటూ పరిశుభ్రత కోసం ఊరూవాడా చైతన్యం వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.ఆయన మృతి మీడియా రంగానికి, తెలుగుజాతికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొల్లపల శీను, ముక్కామల శివ, జనసేన యువనాయకుడు కారుమూరి ఆంజినేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రామోజీరావు సేవలు చిరస్మరణీయం: గొట్టిపాటి లక్ష్మి

దర్శి, మేజర్‌న్యూస్: సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తి సమాజమే హద్దుగా ఎదగాలని కోరుకున్నే వ్యక్తి రామోజీ రావు అని, ఆయన మృతి ఎన లేనదాని దర్శి నియోజకవర్గం ఎన్.డి.ఎ కుటమి ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యాలయం నందు ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు స్వర్గస్తులైనందున ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దర్శి నియోజకవర్గ కూటమి నేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి,మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు నివాళ్ళు అర్పించారు. అనంతరం డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సాధారణ వ్యక్తిగా జీవితం ప్రారంభించి అసాధారణ స్థాయికి ఎదిగిన మహెూన్నత వ్యక్తి రామోజీ రావు అన్నారు. తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన రామోజీరావు, ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. కలమే ఆయుధంగా సమాజంలో చైతన్యం నింపేందుకు రామోజీరావు అహర్నిశలు శ్రమించారు అన్నారు. జర్నలిజం రంగంలో కొత్త ఒరవడి సృష్టించారన్నారు. కళా రంగం, పర్యాటకం, ఆతిథ్యం, జర్నలిజం వంటి పలు విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందించిన దార్శనికుడు రామోజీ రావు అన్నారు. సాధారణ వ్యక్తిగా



జీవితం ప్రారంభించి అసాధారణ స్థాయికి అంచలంచెలుగా ఎదిగిన ఆయన ప్రస్థానం, జీవితం నేటి తరానికి ఆదర్శనీయం అన్నారు. రామోజీరావు ఇక లేరన్న వార్త బాధిస్తోందని . ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



## టీడీపీ అధ్వర్యంలో రామోజీరావుకు నివాళులు

సి.యస్.పురం, మేజర్‌న్యూస్: ఈనాడు గ్రూపుసంస్థల అధినేత, ఈనాడు పత్రిక సంపాదకులు రామోజీరావు మృతికి శనివారం స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు అధ్వర్యంలో టీడీపీ జనసేన బిజెపి నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి అనంతరం పలువురు మాట్లాడుతూ పత్రికారంగంలో అక్షరయోధుడుగా వెలుగొందిన మహామేధావి రామోజీరావు అని అదేవిధంగా ఈనాడు గ్రూపుసంస్థలను స్థాపించి ప్రపం చస్థాయిలో తెలుగుచానెళ్ల ప్రవేశపెట్టిన రామోజీరావు మృతిచెందడం తెలుగురాష్ట్ర ప్రజలకే కాకుండా దేశానికి తీరనిలోటని పారిశ్రామిక సినీరంగంలో రామోజీరావు ఆదర్శంగా నిలిచినట్లు రామోజీ రావు మృతికి మండల టిడిపి జనసేన బిజెపి కూటమి తరపున సంతాపాన్ని తెలుపుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జి యన్.సి.మాల కొండయ్య, మండల బిజెపి అధ్యక్షుడు ఇండ్లవెంకటసత్యం,ఎస్సీసెల్ రాష్ట్రకార్యదర్శి దాసరిమల్లికా ర్జున, నాయకులు పునుగుపాటి రవికుమార్, ఏ.రామకృష్ణంరాజు,రేనాటి వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్, వెంకటకొండయ్య, బి.వెంకటాద్రి, బి.వెంకటరా మయ్య, శ్రీనివాసులు, పలువురు టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామోజీరావు మృతికి ఆనందబాబు సంతాపం

భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల బాబు వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.శనివారం ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక,టీవీ,సినీ రంగాలలో తనదైన ముద్ర వేసుకున్న రామోజీరావు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటన్నారు.సామాన్య కుటుంబంలో జన్మించి క్రమశిక్షణతో అంచెలం చెలుగా ఎదిగి ఈనాడు గ్రూపు సంస్థల స్థాపించి ఎంతోమందికి ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు కల్పించారన్నారు. రామోజీరావు జీవితం ఎంతో ఆదర్శనీయమని కొనియాడారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.అదేవిధంగా మండల



గ్రామాల్లో ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మృతి పట్ల పలువురు సామాజికవేత్తలు,టిడిపి నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.



**శనివారం ఉదయం తిరుమలలో అఖిలాండ కోటి బ్రహ్మండనాయక శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి**

